

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 16-05-2025 | సంపుటి - 24 | సంచిక - 14 రూ : 4 | పేజీలు: 8


## శాంతికోసం భారత్‌తో చర్చలకు సిద్ధం

: పాక్

- కశ్మీర్‌నూ చేర్చాలన్న షెహబాజ్

ఇస్లామాబాద్: భారత్‌తో చర్చలకు పాక్ సంసిద్ధత వ్యక్తం చేసింది. శాంతి కోసం దీనిని ప్రతిపాదిస్తున్నామని, అయితే కశ్మీర్ అంశం కూడా చర్చల్లో చేర్చాలనేది తమ షరతు అని పాక్ ప్రధాని



2లో

## గుట్టపై బుట్టబొమ్మలు



- 'ఇక్కత్'తో మెరిసిన ముద్దుగుమ్మలు

**మే 15 :** ఆధ్యాత్మిక నగరి యాదగిరిగుట్టలో.. భౌగోళిక గుర్తింపు పొందిన పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల ప్రాంగణంలో 'ప్రపంచ సుందరి' పోటీదారులు గురువారం సందడి చేశారు. స్వర్ణతాపడంతో మెరుస్తున్న యాదాద్రీశుడి గోపురాలు.. కృష్ణశిలతో చేసిన ఆలయ ప్రాకారాలు.. స్తంభోద్భవుడి చారిత్రక.. ఆధ్యాత్మిక వైభవాలను ఆసక్తిగా తిలకించారు. సంప్రదాయ పట్టుపరికిణీలు, పట్టుచీరలు ధరించి.. నుదుటన తిలకం దిద్దుకుని.. లయబద్ధంగా నడుస్తూ అఖండదీపం వెలిగించారు. ఆలయ అర్చకులు నర్సింహమూర్తి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

తరువాయి 2లో

## లైసెన్స్‌డ్ సర్వే అభ్యర్థులకు రేపటి నుంచి దరఖాస్తులు

- 5 వేల మందిని తీసుకుంటాం..
- మంత్రి పొంగులేటి వెల్లడి

**మే 15, హైదరాబాద్:** కర్ణాటకలో విజయవంతమైన లైసెన్స్‌డ్ సర్వే విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు రెవెన్యూ, గృహనిర్మాణశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొత్తం 5 వేల మంది సర్వేయర్లను ఈ విధానంలో తీసుకుంటామని, ఈ నెల 17 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు తెలంగాణ సర్వే అకాడమీలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సర్వే విధానంపై గురువారం సంబంధిత

తరువాయి 2లో





## గాజాను ... అమెరికా తీసుకోవాలి

- దాన్ని స్వేచ్ఛా మండలంగా ప్రకటించాలి
- పశ్చిమాసియా పర్యటనలో ట్రంప్



**మే 15, దోహా:** పశ్చిమాసియా పర్యటనలో ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. గాజాకు సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. గాజాలోని పాలస్తీనియన్లు ఖాళీ చేయాలని గతంలో ప్రతిపాదించిన ట్రంప్ గురువారం గాజాను అమెరికా ఆధీనంలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ''గాజా ఫొటోలను చూశాను. అక్కడ ఒక్క భవనమూ లేదు. అన్నీ కుప్పకూలాయి. ఆ శిథిలాల కిందే ప్రజలు ఉంటున్నారు. ఇది అంగీకారయోగ్యం కాదు. గాజాను అమెరికా తీసుకోవాలని అనుకుంటున్నాను. స్వేచ్ఛా మండలంగా దాన్ని మలచాలి. గాజాకు సంబంధించిw

తరువాయి 2లో

## రూ.33,000 కోట్ల పెట్టుబడులు



- రాష్ట్రంలో 34 వేల మందికి ఉపాధి
- సీఎం అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం
- 19 ప్రాజెక్టులకు ఆమోదం

అమరావతి: ఇంధన, పర్యాటక, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో రూ.33,720 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు దిగ్గజ సంస్థలు

తరువాయి 2లో

## ఏపీలో ఉద్యోగుల బదిలీలకు ఆమోదం

- నేటి నుంచి జూన్ 2 వరకు నిషేధం సడలింపు
- ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన వారికి మార్పు తప్పనిసరి
- ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ప్రాధాన్యం
- మార్గదర్శకాలు జారీచేసిన ప్రభుత్వం

2లో



## రూ.200 కోట్లతో పర్యాటక క్షేత్రంగా కాళేశ్వరం

- మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేస్తే గోదావరి పుష్కరాలలోపు పనుల పూర్తి
- సరస్వతి పుష్కర స్నానం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**మే 15, సమయం న్యూస్, వరంగల్:** దక్షిణ కాశీగా గొప్ప చరిత్ర కలిగిన కాళేశ్వరానికి రూ.200 కోట్లు కేటాయించి ప్రముఖ పర్యాటక క్షేత్రంగా మారుస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేవాదాయ శాఖ మంత్రి సురేఖ, శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్‌లు దేవాలయ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేస్తే 2027లో జరిగే గోదావరి పుష్కరాలలోపు పనులన్నీ పూర్తి చేస్తామని, పనులకు గ్రీన్ ఛానెల్‌లో నిధులిస్తామని తెలిపారు. ఇక్కడ సరస్వతి నది పుష్కర స్నానం ఆచరించడం తనకు దక్కిన గొప్ప గౌరవమన్నారు. రానున్న మూడేళ్లలో గోదావరి, కృష్ణా నది పుష్కరాలతో పాటు మేడారం జాతరను ఘనంగా నిర్వహిస్తామని ఉద్ఘాటించారు. పుష్కర స్నానం ఆచరించడానికి గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖతో కలిసి హెలికాప్టర్‌లో ఆయన కాళేశ్వరం చేరుకున్నారు. నది ఒడ్డున ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహాన్ని మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆవిష్కరించారు. సీఎం, ఇతర ప్రజాప్రతినిధులకు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి ముఖ్యమంత్రి శ్రీ కాళేశ్వర, ముక్తీశ్వరస్వామి వార్లను, సరస్వతి దేవిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. అక్కడే ఉన్న మాధవానంద

తరువాయి 2లో



# రూ.33,000 కోట్ల పెట్టుబడులు

(మొదటిపేజీ తరువాయి)

ముందుకొచ్చాయని ప్రభుత్వం పేర్కొంది. 19 ప్రాజెక్టుల ఏర్పాటుకు కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా 34,621 మందికి ఉపాధి లభించనుందని తెలిపింది. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఏటీసీ టైర్స్, వింగ్‌టెక్ మొబైల్స్, డైకిన్ వంటి దిగ్గజ సంస్థలతో పాటు వివిధ సంస్థల నుంచి అందిన పెట్టుబడుల ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సచివాలయంలో గురువారం సమావేశమైంది. సీఎం మాట్లాడుతూ.. 'వైకాపా ప్రభుత్వ విధానాలతో రాష్ట్రం పెట్టుబడిదారుల విశ్వాసాన్ని కోల్పోయింది. పారిశ్రామికవేత్తలను తిరిగి రాష్ట్రానికి రప్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక ఈ 11 నెలల్లోనే ఆరు సార్లు ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించాం. మొత్తం 76 ప్రాజెక్టులకు సంబంధించి రూ.4,95,796 కోట్ల పెట్టుబడులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వాటి ద్వారా 4,50,934 మందికి ఉపాధి లభించనుంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశీ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్న వెంటనే ప్రాజెక్టు ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని సంస్థలకు శంకుస్థాపన చేశాం. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పాలసీలే పెట్టుబడుల ఆకర్షణకు ప్రధాన కారణం' అని పేర్కొన్నారు. కొన్నిచోట్ల వ్యవసాయ వ్యర్థాలను తగలబెడుతున్నారని, దీన్ని నియంత్రించే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అగ్రికల్చర్ వేస్ట్‌ను వినియోగించుకుని సర్క్యులర్ ఎకానమీగా మార్చే పరిశ్రమలకు ప్రోత్సాహాన్ని అందించాలని సీఎం పేర్కొన్నారు.

### * డాష్‌బోర్డు ద్వారా పనుల పురోగతి పర్యవేక్షణ

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకున్న సంస్థలతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తుండాలని అధికారులకు సీఎం సూచించారు. 'ప్రాజెక్టుల శంకుస్థాపన నుంచి ప్రారంభోత్సవం వరకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. వాటి పురోగతిని సమీక్షించాలి. పనుల స్థితిగతులను తెలుసుకునేందుకు డాష్ బోర్డ్ తీసుకురావాలి. పెట్టుబడులతో పాటు వచ్చిన ఉద్యోగాల వివరాలతో పోర్టల్ ఏర్పాటు చేయాలి. ఇకపై నిర్వహించే ఎస్ఐపీబీ సమావేశాల్లో కొత్త పెట్టుబడులకు ఆమోదం తెలపడంతో పాటు గతంలో ఒప్పందాలు కుదుర్చుకున్న ప్రాజెక్టుల పురోగతిని వివరించాలి' అని సీఎం ఆదేశించారు.

### కారవాన్స్ పాలసీ తీసుకొస్తాం

పర్యాటకులను ఆకర్షించేందుకు కారవాన్స్ పాలసీ సిద్ధం చేయాలని చంద్రబాబు సూచించారు. 'దేవాలయాలకు వచ్చేవారికి ప్రశాంతమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలి. రాష్ట్రంలో రద్దీగా ఉండే 21 దేవాలయాల్లో వసతి సౌకర్యాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలి. టెంట్లు (గుడారాలు) ఏర్పాటు చేసి వసతి కల్పించే ప్రాజెక్టులను ప్రారంభించాలి. పర్యాటక రంగంలో హోటళ్లు, గదుల కొరత అధిగమించేందుకు 50 వేల గదులు అందుబాటులోకి తీసుకురావాలన్నది లక్ష్యం. గదుల ధరలు అందుబాటులో ఉంటే పర్యాటకులు ఆయా ప్రాంతాల్లో బస చేస్తారు. గోదావరి, కృష్ణా నదుల వద్ద నిర్వహిస్తున్న హారతుల కార్యక్రమాలకు ఆధ్యాత్మిక శోభ పెంచే చర్యలు చేపట్టాలి' అని సీఎం సూచించారు.

# ఏపీలో ఉద్యోగుల బదిలీలకు ఆమోదం

అమరావతి : రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈనెల 16 నుంచి జూన్ 2 వరకు బదిలీలపై నిషేధాన్ని సడలిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీలు, పోస్టింగ్‌లకు సంబంధించి మార్గదర్శకాలు జారీచేసింది. జూన్ 3 నుంచి బదిలీలపై మళ్లీ నిషేధం అమల్లోకి వస్తుందని ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీ పియూష్ కుమార్ పేర్కొన్నారు. ఈ నెలాఖరుకు ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన ఉద్యోగులు తప్పనిసరిగా బదిలీ అవుతారు. ఐదేళ్లు పూర్తికాని ఉద్యోగులు కూడా అభ్యర్థనపై బదిలీకి అర్హులు. అలాగే 2026 మే 31లోపు రిటైర్ అయ్యే వారికి బదిలీ ఉండదు. వారిని విజ్ఞప్తిపై లేదా పరిపాలన కారణాలతో బదిలీ చేయొచ్చు.

* బదిలీ కోసం ఒక స్టేషన్‌లో అన్ని కేడర్లలో పనిచేసిన కాలాన్ని పరిగణిస్తారు. స్టేషన్ అంటే ఉద్యోగి పనిచేసిన నగరం, పట్టణం, గ్రామంగా పరిగణిస్తారు. అంతేగానీ కార్యాలయం, సంస్థను పరిగణనలోకి తీసుకోరు.
* బదిలీల్లో దృష్టి సమస్యలు ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు.
* మానసిక వైకల్యమున్న పిల్లలు ఉన్న ఉద్యోగులు.. సంబంధిత వైద్య సదుపాయాలున్న స్టేషన్‌కు బదిలీ అడిగితే ప్రాధాన్యమిస్తారు.
* గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకుపైగా పనిచేసిన వారికి, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుంది.
* ఉద్యోగి, భాగస్వామి, వారిపై ఆధారపడిన పిల్లల్లో ఎవరికైనా క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, న్యూరోసర్జరీ, కిడ్నీ మార్పిడి వంటి దీర్ఘకాలిక వ్యాధులుంటే.. ఆ వైద్య సదుపాయాలున్న చోటుకు బదిలీకి ప్రాధాన్యం ఇస్తారు.
* కారుణ్య నియామకం కింద నియమితులైన వితంతు మహిళా ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారు.
* తొలుత ఏజెన్సీ ప్రాంతాల్లోని ఖాళీల భర్తీ
* నోటిఫైడ్ ఏజెన్సీ ప్రాంతాల్లోని ఖాళీలను మొదట భర్తీ చేయాలి. ఆ తర్వాత నాన్‌ఐటీడీఏ ప్రాంతాల్లోని పోస్టులు నింపాలి.
* ఐటీడీఏ ప్రాంతాలతో పాటు మారుమూల, వెనకబడిన ప్రాంతాల్లోని ఎక్కువ ఖాళీలున్న ప్రాంతాలకు బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వాలి.
* ఐటీడీఏ ప్రాంతాల్లోని లోకల్, జోనల్ కేడర్లలో పనిచేసే ఉద్యోగుల్లో రెండేళ్లకు పైగా పనిచేసిన వారు.. ఎంపిక చేసుకున్న స్టేషన్‌కు బదిలీ చేయొచ్చు.

### 50 ఏళ్లలోపు వారే ఏజెన్సీకి

* ఏజెన్సీ ప్రాంతాల్లో 50 ఏళ్లలోపు వారినే నియమించాలి.
* ఐటీడీఏ ప్రాంతాల్లో ఇప్పటి వరకు పనిచేయని వారిని, మైదాన ప్రాంతాల్లో వాళ్లు పనిచేసిన కాలాన్ని డిసెండింగ్ ఆర్డర్‌లో పరిగణనలోకి తీసుకొని బదిలీ చేయాలి.
* ఐటీడీఏ ప్రాంతం నుంచి బదిలీ అయిన వారి స్థానంలో.. బదిలీపై వచ్చే అధికారి రిపోర్ట్ చేసిన తర్వాతే వారిని రిలీవ్ చేస్తారు.
* నాన్ ఐటీడీఏ ప్రాంతం నుంచి ఐటీడీఏ ప్రాంతంలో పోస్టింగ్ పొందిన ఉద్యోగులు గడువులోపు రిపోర్ట్ చేయాలి. అలా చేయకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు.

### ఉద్యోగ సంఘాల నేతలకు మూడు టెర్మ్‌ల అవకాశం

* గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలకు సంబంధించి రాష్ట్ర, జిల్లా, డివిజన్/మండల స్థాయిలో ఆఫీస్ బేరర్లకు మూడు టెర్మ్‌లు పూర్తయ్యేవరకు కానీ, ఒకే స్టేషన్‌లో 9 ఏళ్లు పూర్తయ్యే వరకు కానీ బదిలీ చేయకూడదు.
* తాలూకా, జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్ల జాబితా సంబంధిత కలెక్టర్ ద్వారా హెచ్‌వోడీకి పంపాలి.
* రాష్ట్ర సంఘం జాబితాను జీఏడీ ద్వారా మాత్రమే రాష్ట్రస్థాయి హెచ్‌వోడీకి పంపాలి.

### ఇదీ నియమావళి..

* అన్ని బదిలీలు సంబంధిత విభాగాల విధానాలు, నియామకాలను అనుసరించి నిర్వహిస్తారు.
* జిల్లా, జోనల్, మల్టీజోనల్ కేడర్లలోని ఉద్యోగుల బదిలీలు, పోస్టింగ్‌లకు సంబంధించి ఉమ్మడి జిల్లాలు, జోన్‌లు, మల్టీ జోన్‌లను మాత్రమే యూనిట్‌గా పరిగణిస్తారు.
* ప్రతి శాఖలో బదిలీల కోసం అంతర్గత కమిటీలను ఏర్పాటు చేసి, అభ్యర్థనలు పరిశీలించి.. ఉన్నతాధికారికి తగిన సిఫార్సులు చేయాలి.
* బదిలీ ప్రక్రియకు ఆయా విభాగాధిపతులే పూర్తి బాధ్యులు. పారదర్శకంగా, నిర్దేశిత కాలపరిమితిలోగా వివాదాలు, ఫిర్యాదులకు తావు లేకుండా చేయాల్సిన బాధ్యత వారిదే. మార్గదర్శకాలు ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిగణిస్తారు.

### పదోన్నతిపై బదిలీ తప్పనిసరి

* పదోన్నతిపై ఉద్యోగులు తప్పనిసరిగా ప్రస్తుత స్థానం నుంచి బదిలీ అవుతారు. ఒకవేళ ఇతర ప్రాంతాల్లో పదోన్నతి పోస్టు లేకపోతే మాత్రమే ప్రస్తుత స్థానంలో కొనసాగుతారు.
* దృష్టి సమస్యలు ఉన్న ఉద్యోగులను బదిలీ నుంచి మినహాయిస్తారు. వాళ్లే బదిలీ కోరితే, సాధ్యమైనంత వరకు వారు ఎంపిక చేసుకున్నచోట ఖాళీ ఉంటే అవకాశం కల్పించవచ్చు.
* దంపతులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే.. వారిని ఒకేచోట లేదా దగ్గరగా ఉండేచోట్ల నియమించేలా చూడాలి.

# 'తీస్తా ప్రహార్' పేరుతో భారత్ భారీ విన్యాసాలు

దిల్లీ: పశ్చిమ బెంగాల్‌లోని తీస్తా ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో 'తీస్తా ప్రహార్' పేరుతో భారత సైన్యం భారీ ఎత్తున సైనిక విన్యాసాలు నిర్వహించింది. నదీ తీర ప్రాంతంలో యుద్ధం సంభవిస్తే ఎలా ఎదుర్కోవాలి.. శత్రువు వ్యూహాలను ఎలా ధ్వంసం చేయాలన్న దానిపై కసరత్తు చేసింది. ఆయుధ రవాణా, సైనికుల మధ్య సమన్వయం తదితర అంశాలను క్షేత్ర స్థాయిలో పరీక్షించింది. ఇటీవల భారత సైన్యంలోకి అత్యాధునిక సాంకేతిక వ్యవస్థ, ఆయుధాలు వచ్చి చేరిన క్రమంలో వాటిని వినియోగించడం, సాంకేతికంగా ఎదురయ్యే సమస్యలపై ఈ విన్యాసాల్లో ప్రధానంగా దృష్టి సారించింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు ఎలా వ్యవహరించాలన్నదానిపై కసరత్తు చేసింది. శత్రువుల నుంచి పొంచి ఉన్న ప్రమాదాన్ని పసిగట్టి అప్పటికప్పుడు ఎలా వ్యవహరించాలన్న



దానిపై డ్రిల్స్ నిర్వహించింది. దీనిపై భారత సైన్యం.. ఓ వీడియోను విడుదల చేసింది.

# పుల్వామాలో ముగ్గురు ఉగ్రవాదుల హతం



శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. త్రాల్ ప్రాంతంలో జరిగిన ఎదురు కాల్పుల్లో జైషే మహమ్మద్ ఉగ్ర ముఠాకు చెందిన ముష్కరులను సైన్యం హతమార్చినట్లు పోలీసులు వెల్లడించారు. ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న నిఘా సమాచారంతో నదిర్ గ్రామంలో గురువారం సైన్యం తనిఖీలు చేపట్టింది. ఈ క్రమంలోనే భద్రతా దళాలపైకి ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఇది ఎన్‌కౌంటర్‌కు దారి తీయడంతో.. ఆసిఫ్ అహ్మద్ షేక్, ఆమిర్ నజీర్ వానీ, యావర్ అహ్మద్ భట్ అనే ఉగ్రవాదులను సైన్యం మట్టుబెట్టింది. వీరంతా పుల్వామా ప్రాంతానికి చెందినవారే కావడం గమనార్హం. ఆమిర్ నజీర్ వానీ ఎదురు కాల్పులకు కొద్దిసేపటి ముందే తన కుటుంబ సభ్యులతో మాట్లాడిన వీడియో కాల్ రికార్డింగ్ సైతం బయటకు వచ్చింది. సైన్యం ఎదుట లొంగిపోవాలని తల్లి, తన సోదరి అతడిని ప్రాధేయపడినట్లు వీడియోలో ఉంది.

## రూ.200 కోట్లతో పర్యాటక క్షేత్రంగా కాళేశ్వరం



(మొదటిపేజీ తరువాయి)

సరస్వతితో సీఎం కాసేపు ముచ్చటించారు. ఈ పుష్కరాల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మహాహారతిని తిలకించి పరవశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

### పుష్కరాలు నిర్వహించడం నా అదృష్టం

''నదులు నాగరికతకు ఆనవాళ్లే కాకుండా వాటిని దేవతలుగా భావిస్తారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం తొలిసారి వచ్చిన సరస్వతి పుష్కరాలివి. ప్రభుత్వం ఇక్కడకు వస్తున్న భక్తులకు మౌలిక వసతులు కల్పిస్తోంది. పుష్కర స్నానం చేస్తే ముక్తి కలుగుతుంది. రానున్న మూడేళ్లలో ప్రముఖ నదుల పుష్కరాలను నిర్వహించడం నాకు దక్కుతున్న అదృష్టంగా భావిస్తున్నా. వాటిని ఘనంగా నిర్వహించేందుకు ఈ పుష్కరాలే పునాది.

### మంత్రి శ్రీధర్‌బాబు పాత్ర కీలకం

కాళేశ్వర క్షేత్రం కొలువై ఉన్న మంథని నియోజకవర్గానికి గొప్ప చరిత్ర ఉంది. దేశ ప్రధాని పదవిని అధిష్ఠించిన పీవీ నరసింహారావు ఇక్కడి నుంచే ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. అనంతరం ఆయన వారసుడిగా అడుగుపెట్టిన శ్రీపాదరావు అసెంబ్లీలో స్పీకర్‌గా ఉండి సభను హుందాగా నడిపారు. ఆయన గొప్పతనాన్ని ఇటీవల దావోస్‌లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం అభినందించి ఆనాటి జ్ఞాపకాలను, నాతో, శ్రీధర్‌బాబుతో పంచుకున్నారు. ఆయన్ను కోల్పోవడం దురదృష్టం. మూడో తరం వారసుడిగా శ్రీధర్‌బాబు రాజకీయాల్లోకి వచ్చారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన 16, 17 నెలల్లో ఆయన హయాంలోనే రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ప్రైవేటు రంగంలో లక్ష ఉద్యోగాలను తీసుకురావడంలో ఆయన పాత్ర కీలకం. మంథని ప్రజల ప్రతిష్ఠ పెంచే విధంగా ఆయన పనిచేస్తున్నారు. ఆయన లాంటి నాయకుడు ఉండటం మీ అదృష్టం'' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## గుట్టపై బుట్టబొమ్మలు

(మొదటిపేజీ తరువాయి)

మిస్‌వరల్డ్ పోటీదారుల యాదగిరిగుట్ట, పోచంపల్లి పర్యటన గురువారం ఆహ్లాదంగా సాగింది. ఆఫ్రికా, కరేబియన్ దేశాలకు చెందిన సుందరీమణులు హైదరాబాద్ నుంచి పర్యాటక శాఖ ప్రత్యేక బస్సుల్లో గురువారం సాయంత్రం 5 గంటలకు యాదగిరిగుట్టకు చేరుకున్నారు. ఇక్కడ ప్రోటోకాల్ అతిథిగృహంలో ప్రొజెక్టర్ ద్వారా ఆలయ విశిష్టతను దేవస్థాన వైస్‌ఛైర్మన్ కిషన్‌రావు వారికి వివరించారు. తర్వాత సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన పోటీదారులు.. కోలాటం, సంప్రదాయ భజన, శాస్త్రీయ నృత్యాల మధ్య తూర్పు రాజగోపురం చేరుకుని ఆగ్నేయంలో ఉన్న ఆలయ గోపురాలు, స్వర్ణతాపడం, ప్రాకారాల వద్ద ఫొటో షూట్‌లో పాల్గొన్నారు. తూర్పు మహాగోపురం వద్ద వేద పండితులు స్వాగతం పలకగా ఆలయంలోకి ప్రవేశించారు. అఖండ దీప మండపాన్ని చేరుకుని దీపారాధన చేశారు. సుందరీమణులకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కలెక్టర్ హనుమంతరావు, ఆలయ అర్చకులు, అధికారులు సాదర ఆహ్వానం పలికారు. అనంతరం సుందరీమణులను ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి దర్శనం చేయించారు. వేదపండితులు మహాఆశీర్వచనం ఇచ్చి ప్రసాదాలు, శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రతిమలు, జ్ఞాపికలు అందించారు.

### * ఆలయ శిల్పకళా సంపదకు ముగ్ధులై

కృష్ణశిలతో నిర్మించిన యాదాద్రీశుని గోపురాలు, ఆలయ ప్రాకారాలు, దేవాలయ సన్నిధి, శిల్పకళా నైపుణ్యాలు చూసి సుందరీమణులు మంత్రముగ్ధులై తమ సెల్‌ఫోన్‌లలో చిత్రాలుగా బంధించారు. గోపురాలు, శిల్పాలు కనిపించే విధంగా చిత్రాలు దిగారు. అధికారులు, సిబ్బందితో కలిసి బృంద చిత్రాలు దిగి మురిసిపోయారు. ఆలయంలో మహిళలు భక్తిప్రపత్తులతో కోలాట నృత్యాలు చేస్తుంటే.. అందగత్తెలూ పాల్గొని లయబద్ధంగా కోలలు కలుపుతూ నృత్యాలు చేసి అలరించారు. రెండు చేతులు జోడించి నమస్కారం.. బాగున్నారా..! అంటూ చిరునవ్వుతో వారు పలకరిస్తుంటే స్థానికులు ఆశ్చర్యచకితులయ్యారు. 'దేవస్థానంలో నిర్వహించిన పూజలు, ఏకశిలతో చేసిన ఆలయ శిల్ప సంపద బాగుంది. వీలైతే మరోసారి వస్తాం' అని పలువురు పోటీదారులు ఉత్సాహంగా చెప్పారు. అనంతరం రాత్రి 7.15 గంటల సమయంలో ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు.

## శాంతికోసం భారత్‌తో చర్చలకు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

షెహబాజ్ షరీఫ్ చెప్పారు. పాక్‌లోని పంజాబ్ ప్రావిన్సులో కామ్రా వైమానిక స్థావరాన్ని గురువారం సందర్శించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగాలని, వాటిని తమ నుంచి విడదీయలేరని భారత్ పదేపదే స్పష్టం చేస్తున్నా ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## లైసెన్స్‌డ్ సర్వే అభ్యర్థులకు రేపటి నుంచి దరఖాస్తులు

(మొదటిపేజీ తరువాయి)

శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ''రాష్ట్రంలో శాశ్వతంగా భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చాం. రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూమి సర్వే మ్యాప్‌ను తప్పనిసరి చేశాం. ఈ విధానం అమలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. మండలాల్లో భూలావాదేవీలు, భూ విస్తీర్ణాన్ని బట్టి సర్వేయర్లను నియమించాలి. కర్ణాటకలో 20 ఏళ్ల క్రితం నియమితులైన సర్వేయర్లు కొనసాగుతూనే ఉన్నారు. రాష్ట్రంలో కూడా అదే విధానాన్ని అవలంబించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి'' అని మంత్రి వివరించారు.

## గాజాను అమెరికా తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

నాకు మంచి ఆలోచనలు ఉన్నాయి'' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌తో జరుగుతున్న అణుచర్చలకు సంబంధించి కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చితో జరుగుతున్న చర్చలు దీర్ఘకాల శాంతిని సాధిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా చేసిన ప్రతిపాదనకు ఇరాన్ దాదాపు అంగీకరించిందన్నట్లు వ్యాఖ్యలు చేశారు. మరోవైపు గాజాలో మరణ మృదంగం మోగుతూనే ఉంది. ఖాన్‌యూనిస్‌పై ఇజ్రాయెల్ నిర్వహించిన వైమానిక దాడుల్లో 54 మంది ప్రాణాలు కోల్పోయారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం రావడమే అబద్ధాల పునాదులపై వచ్చింది

*** బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కాంగ్రెస్ ప్రభుత్వం రావడమే అబద్ధాల పునాదులపై వచ్చిందని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, అనాలోచిత నిర్ణయాలపై కోర్టులు మొట్టికాయలు వేయడంపై ప్రభుత్వ పాలన తీరును ఎండగడుతూ బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గురువారం మీడియా ముఖంగా ఎండగట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాలను ఎప్పటికప్పుడు కోర్టులు తప్పు పడుతూనే ఉన్నాయన్నారు. కంచె గచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందన్నారు. ప్రజలనే కాదు కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. సీఎం ఫ్రస్టేషన్ లో ఉత్తమ్ కుమార్ రెడ్డి సీఎం అనడంతో



ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. అనాలోచిత నిర్ణయాలు, అనుభవరాహిత్య నిర్ణయాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. రెండు ఏళ్ళు అవుతున్న ఇంకా ఏం అభివృద్ధి చేయకుండా బిఆర్ఎస్ పై బురద చల్లుతున్నారన్నారు. ఇప్పటికే గత ప్రభుత్వంపై పదికి పైగా ఎంక్వరీలు వేశారు ఎక్కడ ఏం రుజువు చేయలేదన్నారు. ఇప్పుడు మళ్ళీ ధరణి ఫోరెన్సిక్ అడిట్ అని మళ్ళీ ఇంకో ఎంక్వైరీ వేస్తారట, ఇకనైనా ఆరోపణలు మాని పని చేయాలన్నారు.

## మాజీ మంత్రి కెటీఆర్ ను కలిసిన 22వ బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు శ్రీకర్ గుప్తా



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నిజాంపేట్ కార్పొరేషన్ 22వ బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు శ్రీకర్ గుప్తా జన్మదినం సందర్భంగా గురువారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని, బిఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ శ్రీకర్ గుప్తా ను శాలువాతో సత్కరించిన. అనంతరం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ఆధ్వర్యంలో నగరంలోని కేటీఆర్ నివాసంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ గా పి.శివకుమార్



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లా , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ గా పి.శివకుమార్ నూతనంగా బాధ్యతలు స్వీకరించారు.ఇంతకు ముందు ఇక్కడ ఈ.ఎం.ఆర్.ఐ. గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ బదిలీపై వెళ్ళడంతో ఆయన స్థానంలో శివకుమార్ బదిలీపై వచ్చారు. 108 అత్యవసర సేవలు,102, అమ్మ ఒడి,1962 (పశు సంచార) వాహనాలు,పార్థివ వాహనాల సేవలు అన్నింటికీ గాను ప్రోగ్రాం మేనేజర్ పి.శివకుమార్ పర్యవేక్షణలో నడపబడుతాయని, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఈ అత్యవసర సేవలను అందరూ సద్వినియోపరుచుకోగలరని తెలిపారు.

## వాటర్ ఫిల్టర్ ను ప్రారంభించిన

*** మాజీ టెస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి**



యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి : యాదగిరిగుట్ట మండలంలోని రామాజీపేట అహ్మద్ నగర్ లో పిఎసిఎస్ చైర్మన్ ఇమ్మడి రామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్ ను ప్రారంభించిన అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చేరుకొండ రాజుని బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన డిసిసిబి మాజీ చైర్మన్, మాజీ టెస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు కర్రె వెంకయ్య, మాజీ జడ్పిటిసి తోటకూర అనురాధ బీరయ్య, ఆలేరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, మాజీ సర్పంచ్ మొగిలిపాక తిరుమల రమేష్, మాజీ సర్పంచ్ ఏలూరి బాలనర్సయ్య, గ్రామశాఖ అధ్యక్షులు ఆరె స్వామి గౌడ్, యాట పరుషరాములు,గడ్డం దేవేందర్, శ్రీలత సత్తయ్య, సుదర్శన్, ముత్యాలు, బాబు, నర్సింహులు, ఎల్లయ్య, బిక్షపతి, నర్సయ్య, మండల నాయకులు, యూత్ నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు..

## ఇండస్ట్రీ అకాడమియా కలయికను ప్రోత్సహించేందుకు క్యాప్ జెమినితో బీవిఆర్ఐటీ ఒప్పందం




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : బాచుపల్లి బీవిఆర్ఐటీ హైదరాబాద్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ , గ్లోబల్ బిజినెస్, టెక్నాలజీ ట్రాన్సఫర్మేషన్ పార్టనర్ క్యాప్ జెమినితో భాగస్వామ్యాన్ని గురువారం అధికారికంగా ప్రకటించింది. ఈ రెండు సంస్థలు బీవిఆర్ఐటీ హైదరాబాద్ క్యాంపస్ లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పరస్పర అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ అవగాహన ఒప్పంద సంతక కార్యక్రమంలో రెండు సంస్థల నుంచి ప్రముఖ ప్రతినిధులు హాజరయ్యారు. వీరిలో శ్రీ విష్ణు విద్యా సంస్థల వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, కార్యదర్శి ఆదిత్య విస్సం కె, క్యాప్ జెమిని కి చెందిన ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సమీర్ షా, వైస్ ప్రెసిడెంట్ వినోద్ జైన్ , సీనియర్ డైరెక్టర్ రితేష్ రంజన్, సీనియర్ మేనేజర్ తేజవి పలువురు ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ విష్ణు విద్యా సంస్థల వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ మాట్లాడుతూ భవిష్యత్ నైపుణ్యాలతో విద్యార్థులను సిద్ధం చేయడాన్ని లక్ష్యంగా చేసుకున్న ఈ ఇండస్ట్రీ అకాడమీయా భాగస్వామ్యాన్ని ప్రకటించడంలో తాము గర్వ పడుతున్నామన్నారు. విద్య, పరిశ్రమ ల మధ్య ఖాళీని పూడ్చి ఆవిష్కరణ ప్రాక్టికల్ లెర్నింగ్ , కేరిర్ సిద్ధతను పెంపొందించనుందన్నారు. బీవిఆర్ఐటి హైదరాబాద్ కాలేజ్ కార్యదర్శి ఆదిత్య విస్సం మాట్లాడుతూ క్లౌడ్ కంప్యూటింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలపై విద్యార్థులకు కేంద్రిత అవగాహన కల్పించేందుకు క్యాప్ జేమినితో తాము చేస్తున్న ఈ వ్యూహాత్మక భాగస్వామ్యంలో భాగస్వాములుగా ఉండడం గర్వ కారణమన్నారు. విద్యార్థుల భవిష్యత్ ఉద్యోగార్హతను గణనీయంగా మెరుగుపరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్విఈఎస్ డైరెక్టర్ సతీష్ చంద్ర పారుచూరి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సునీల్ , ప్రధాన ఐటి విభాగం డాక్టర్ అరుణ, సీసీఎస్ విభాగం ప్రధాన డాక్టర్ శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

## చండ్రుగొండ మండలంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ విస్తృత పర్యటన



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: చండుగొండ మండలంలో మంగయ్య బంజర, పోకలగూడెం , రావికంపాడు గ్రామంలో గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ విస్తృతంగా పర్యటించి, గ్రామాల్లో చేపడుతున్న ఇంకుడు గుంతల నిర్మాణం, ఫారం పాండ్స్, కమ్యూనిటీ పశుశాల నిర్మాణ పనులను పరిశీలించారు. చంద్రుగొండ మండలంలో పర్యటనలో భాగంగా ముందుగా కలెక్టర్ మంగయ్య బంజర గ్రామపంచాయతీ పరిధిలోని మాలోతు పకీరీ వ్యవసాయ క్షేత్రంలో నిర్మిస్తున్న పారం పొండ్ పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ భూగర్భ జలాలు పెంపొందించడానికి, భవిష్యత్ తరాలకు నీటి ఎద్దటి నివారించడానికి ఫామ్ పౌండ్ నిర్మాణం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ ఫామ్ పౌండ్ నిర్మాణం ద్వారా భూగర్భ జలాల అభివృద్ధి చెందటంతో పాటు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో కొంతమంది రైతులు ఫామ్ పౌండ్ లలో చేపల పెంపకం లో విజయం సాధించారని, అందరూ వారిని ఆదర్శంగా తీసుకొని లాభాలు గడించాలన్నారు. అనంతరం తోకల గూడెం గ్రామపంచాయతీలో ఉపాధి హామీ కూలీల ద్వారా నిర్మిస్తున్న పొలం బాటను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న కూలీలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కూలీలకు అవసరమైన పలుగులు, పారలు అందజేస్తామన్నారు. కూలీలతో ముచ్చటిస్తూ వారితో పాటుగా పలుగు, పార చేతబట్టి కలెక్టర్ పని చేశారు. పోకల గూడెం పంచాయతీ పరిధిలో లో నిర్మిస్తున్న ఇంకుడు గుంతలను పరిశీలించారు. రావికంపాడు గ్రామపంచాయతీ నందు నిర్మిస్తున్న కమ్యూనిటీ పశుశాల పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెట్టు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అదే గ్రామంలో పలువురు రైతులు సాగు చేస్తున్న మునగ సాగును పరిశీలించి, రైతులకు అంతర్ పంటలు వేయడం ద్వారా రైతులు ఏ విధంగా ఆర్థిక అభివృద్ధి చెందవచ్చు వివరించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఎంపీడీవో అశోక్, ఏవో నవీన్, ఎంపీ ఓ ఖాన్, ఏపీవో శ్రీను , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టిక్ ట్యాంక్ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**: కాలనీ వాసులు**

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : నాలాకు ఆనుకొని ఉన్న సెప్టిక్ ట్యాంక్ స్థలాన్ని పరిశీలించి నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కూకట్ పల్లి దీనబంధు కాలనీ బ్రిడ్జి నాలకు ఆనుకొని ఉన్న సెప్టిక్ ట్యాంక్ స్థలం ను కబ్జా చేసి కమర్షియల్ నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మాధవరం కాలనీ ఏర్పాటు సమయంలో సెప్టిక్ ట్యాంకు కోసం స్థలం కేటాయించి సెప్టిక్ ట్యాంకు నిర్మించి కాలనీ అవసరాల కోసం ఉపయోగించామని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వచ్చాక సెప్టిక్ ట్యాంక్ ఉపయోగం లోకి లేకపోవడంతో ఆ ట్యాంక్ స్థలంపై కబ్జాదారులకు కనబడిందన్నారు.



గత రెండు దశాబ్దాల క్రితం ఇదే సెప్టిక్ ట్యాంక్ కబ్జా చేయడానికి పాల్పడడంతో జిహెచ్ఎంసి, మండల అధికారులు కలిసి ఆ నిర్మాణాన్ని అడ్డుకొని నేలమట్టం చేసిన సంఘటన తెలిసిందేనని స్థానికులు పేర్కొంటున్నారు. నాలాకు అనుకోని ఇప్పటికే పలు నిర్మాణాలు కూడా చేపడుతున్నారని. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసి నాళాలు కుంటలు చెరువులు కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నప్పటికీ కబ్జాదారులు లక్షల రూపాయల విలువచేసే స్థలాలను కబ్జా చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మండలాధికారులు, జిహెచ్ఎంసి హైడ్రా అధికారులు స్పందించి నాలాలను అక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## యాదగిరిగుట్టలో ప్రపంచ సుందరిమణులకు స్వాగతం పలికిన

*** రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**

యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి: యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టను గురువారం రోజు ప్రపంచ సుందరిమణులు సందర్శించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కుటుంబ సమేతంగా సుందరీమణులకు స్వాగతం పలికారు... అనంతరం ఆలయ విశిష్టతను ఎల్ఈడి స్క్రిన్ లో చూసారు ఆలయ విశిష్టతను ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సుందరీమణులకు తెలిపి స్వాగతం పలికినట్లు తెలిపారు.. ఆ తర్వాత బ్యాటరీ వాహనాలలో మాడవీధులకు చేరుకొని అఖండ దీపంనికి నెయ్యిని సమర్పించారు.. అనంతరం కోలాటాలు, నృత్యాల మధ్య ఆలయంలో చేరుకున్నారు. ఆలయంలో శ్రీ లక్ష్మి నరసింహ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనం చేయగా ఆలయ అధికారులు లడ్డు ప్రసాదాన్ని స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం మాడవీధులలో శిల్పకట్టడాల వద్ద సుందరీమణులు ప్రత్యేక ఫోటోలను తీసుకున్నారు..

## మెండు స్వప్న కు నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి లు



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజాపేట మండలం బసంతాపురం గ్రామానికి చెందిన కోమటిరెడ్డి యువసేన రాష్ట్ర అధ్యక్షులు మెండు భాస్కర్ రెడ్డి భార్య స్వప్న ఇటీవల మృతి చెందగా గురువారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లు స్వప్న చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అందం సంజీవరెడ్డి, రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, ఆలేరు నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు ఇంజ నరేష్, బల్ల గణేష్, పోట్నక్ ప్రమోద్ కుమార్, సుడుగు శ్రీనివాస్ రెడ్డి, శ్రీశైలం, భరత్ గౌడ్, పోతాంశెట్టి వెంకటేశ్వర్లు, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్, మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జాలపు వనజ రామ్ రెడ్డి, రాష్ట్ర జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. గంటకు పైగా కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

## పేదలకు సేవా మార్గంలో వైద్యం అందించాలి

*** డిఎస్పీ రెహమాన్..**

*** ట్రాఫిక్ బారికేడ్లను ప్రారంభించిన డిఎస్పీ..**




భద్రాద్రి కొత్తగూడెం, ప్రజాస్ఫూర్తి : సేవా మార్గంలో పేదలకు సామాన్య ప్రజలకు వైద్యాన్ని అందించాలని కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్ అన్నారు. గురువారం కొత్తగూడెంలోని ఆదిత్య న్యూరో అండ్ గ్యాస్ట్రో ఆసుపత్రి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ కొత్తగూడెం వారికి 20 బారిఖేడ్లను అందజేశారు. ఈ బారికేట్లను డిఎస్పి అబ్దుల్ రెహమాన్ ప్రారంభించి కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసులకు అందించారు. అనంతరం ఆయన ఆదిత్య న్యూరో అండ్ గ్యాస్ట్రో విభాగాలకు సంబంధించిన ప్రముఖ డాక్టర్లు దేవి రెడ్డి ప్రసూన డాక్టర్ షిండే లను అభినందించారు. న్యూరో మరియు గ్యాస్ట్రో విభాగాలకు సంబంధించి పూర్తి సమయం ఉండే డాక్టర్లు కొత్తగూడెంలో అందుబాటులో ఉండడం విశేషమని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చుట్టుపక్కల ప్రాంతాలు ఏజెన్సీ ప్రాంతాలు కావున పేదలు ఎక్కువగా ఉంటారు వారందరికీ అందుబాటులో ఉండే విధంగా వైద్యాన్ని అందించాలని యాజమాన్యాన్ని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ నరేష్, హాస్పిటల్ యాజమాన్యం మారుతి, మణి, సతీష్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

# ఏఈఓ పై సస్పెన్షన్ ఎత్తివేయకపోతే ధర్నా చేస్తాం

*** దూది వెంకటపురం రైతుల హెచ్చరిక**

రాజాపేట , ప్రజా స్ఫూర్తి : రైతుల కోసం వృత్తిని ఆదర్శంగా నిర్వహిస్తున్న ఏఈఓ ప్రణీత ను అకారణంగా సస్పెండ్ చేయడం సబబు కాదని, వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయకపోతే ధర్నా నిర్వహించి న్యాయం జరిగే వరకూ పోరాటం చేయనున్నట్లు దూది వెంకటాపురం రైతులు ముక్తకంఠంతో హెచ్చరించారు. ఇటీవల దూది వెంకటాపురం ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్చార్జి ఏఈఓ ను అకారణంగా సస్పెండ్ చేశారని ఆగ్రహిస్తూ గురువారం కలెక్టర్ కు లిఖితపూర్వకంగా వాస్తవాలను వివరిస్తూ మీడియాతో మాట్లాడారు. రాజపేట మండలం దూది వెంకటాపురం గ్రామ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రం లో జరిగిన సంఘటనపై ఏఈఓ ను సస్పెండ్ చేయడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేసారు. దళారులను గుర్తించి రైతులకు మేలు చేస్తున్న ఏ ఈ ఓ ను సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. వ్యాపారస్తుల ధాన్యం కుప్పలను గుర్తించిన ఏఈఓ పక్కకు పెట్టించారని ప్రత్యేక సాక్షులు రైతులు చెబుతున్నారు. అట్టి దాన్యం కుప్పలకు గన్ని



సంచులు ఇవ్వడం కానీ, తేమశాతం కొలవడం కానీ ఎలాంటివీ ఏఈఓ చేయలేదని రైతులు వివరించారు. వెంటనే డ్యూటీ కల్పించాలని రైతులను కోరారు. ఆర్ డి ఓ వెంటనే విచారణ చేసి ఏ ఈ ఓ సస్పెన్సన్ ఎత్తివేయాలని కోరారు. విధులను చక్కగా నిర్వర్తిస్తూ రైతులకు మేలు చేస్తున్న ఏఈఓ సస్పెన్షన్ నిజాయితీ ఉద్యోగులకు అవమానమని రైతుల హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు లికిత పూర్వక పత్రాన్ని అందించారు. అవసరమైతే ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు వచ్చి ఆర్డిఓ విచారణ జరపాలని రైతులు డిమాండ్ చేశారు.

## ఘనంగా హైకోర్టు న్యాయవాది నర్రి స్వామి జన్మదిన వేడుకలు



యాదాద్రి భువనగిరి, ప్రజా స్ఫూర్తి : తెలంగాణ సామాజిక చైతన్యత రాష్ట్ర కార్యాలయంలో మరియు వివిధ జిల్లాలలో టి ఎస్ సి వి జిల్లా నాయకుల ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, లాయర్స్ పోరంపర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ , హైకోర్టు ప్రముఖ న్యాయవాది నర్రి స్వామి కురుమ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మా జన్మదిన పురస్కరించుకొని సేవా కార్యక్రమా లు నిర్వహించడం చాలా సంతోషకరం ముఖ్యంగా తిరుపతిలో పిలవబడే యాదగిరిగుట్ట అఖిలాండకోట బ్రహ్మాండ నాయకుడు శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీనరసింహస్వామి నీ దర్శించుకోవడం మరియు ప్రపంచ ఆది దేవుడు చెరువుగట్టు శ్రీశ్రీశ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి నీ దర్శించుకుని అక్కడ ఉన్నటువంటి దివ్యాంగులకు మరియు వివిధ జిల్లాలలో అనాధలకు వృద్ధులకు పండ్ల డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో టి ఎస్ సి బి రాష్ట్ర నాయకుడు శ్రీరామ్ నక్కరాజు జిల్లా నాయకులు బండ సురేష్, కడగంచి శంకర్, మందుల రాము వెంకటేష్ జిల్లా అధ్యక్షుడు సింగం కృష్ణ, దువ్వ నవీన్ అనేకమంది తెలంగాణ సామాజిక చైతన్య వేదిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాజాపేట మండలంలో వేసవి శిభిరాలు ప్రారంభం

రాజాపేట ,ప్రజా స్ఫూర్తి : రాజపేట మండలంలో గురువారం మూడు ఉన్నత పాఠశాలలో వేసవి శిబిరాలు ప్రారంభమయ్యాయి. 15 రోజుల పాటు జరిగే ఆరు నుండి తొమ్మిదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక వేసవి శిబిరాలు రాజాపేట, రఘునాథపూర్, చల్లూరు ఉన్నత పాఠశాలలలో ఉల్లాసముగా ప్రారంభం అయ్యాయి. ఈ శిబిరాలలో యోగ, ధ్యానం, చెస్ ఆట, క్యారమ్ ఆట , మోటివేషన్ ఉపన్యాసాలు, నీతి కథలు, చిత్ర లేఖనం , బొమ్మల తయారీ విధానం మొదలగు వాటికి తర్ఫీదు ఇస్తారని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కార్యక్రమాలను ప్రారంభించి ఎంఈఓ చందా రమేష్ కోరారు. క్రమశిక్షణ తో జరిగే 15 రోజులు శిబిర నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని ఎంఈఓ చెప్పారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు కె. మనోజ్ కుమార్, బి. వసంత, సట్టు. జయంత, ఉపాధ్యాయులు పలుగుల రాజు , కీసరి రమేష్ , నరసింహాచారి, కృష్ణమూర్తి, నామదేవ్, ఇన్స్ట్రక్టర్లు పాల్గొన్నారు. రాజపేట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన శిబిరానికి ఉపాధ్యాయులందరూ దూరంగా ఉండడం చర్చనీయాంశమైంది. ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు జయంత గత విద్యా సంవత్సరం స్కూల్ ఫండ్స్ దుర్వినియోగం, బాసాని యాదగిరి డబ్బులు డ్రా చేయడం, ఇతర అంశాలపై అందరూ అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా విద్యాధికారి ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే రాజపేట ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరే అవకాశాలు లేకుండా పోతాయి.మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వేసవి సెలవుల్లోసమయాన్నివృధా చేయకుండా ఉండేందుకు ప్రభుత్వము ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును మండల




విద్యాధికారి చందా రమేష్ గురువారము ప్రారంభించారు. అనంతరం ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు సట్టు జయంత అధ్యక్షతన నిర్వహించిన సమావేశం లో మండల విద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థులలో మేధాశక్తి,ఏకాగ్రత, నైపుణ్యాలను పెంపొందించడానికి సమ్మర్ క్యాంపులు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు యోగ, సూర్య నమస్కారాలు, చెస్, క్యారమ్స్ లపై అవగాహన కల్పించారు. ఆ తర్వాత విద్యార్థులకు స్నాక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ఏపిపిసి చైర్మన్ టి. రేణుక, పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

*** జిల్లా పోలీసులందరికీ ఆదేశాలు జారీ చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలోని అన్ని పోలీస్ కార్యాలయాలు ,పోలీస్ స్టేషన్లలో ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం తమ కార్యాలయం నుంచి విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకొని,భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించవచ్చని ఈ సందర్భంగా ఎస్పీ తెలియజేసారు.భవిష్యత్ తరాలకు నీటి కొరత ఏర్పడకుండా వర్షపు నీటిని ఆదా చేసుకుంటూ ప్రజలందరూ బాధ్యతగా తమ నివాస ప్రదేశాలలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇంకుడు గుంతల ఏర్పాటును ప్రతిష్టాత్మకంగా తీసుకుందని అన్నారు.ఇందులో భాగంగానే జిల్లా పోలీస్ కార్యాలయాల్లో పోలీస్ స్టేషన్ల ప్రాంగణాలలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకునే విధంగా అధికారులకు సూచించడం జరిగిందని తెలిపారు.

## ఒడ్లు కొనుగులు కేంద్రాన్ని పరిశీలించిన బీజేపీ నాయకులు

*** యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి : బొమ్మలరామరం మండలం**



కేంద్రం లోని మాలోత్ వినోద్ నాయక్ అధ్వర్యంలో హజీపూర్ గ్రామంలో ఒడ్లు కొనుగులు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిదిలిస్తున్న కిసాన్ మోర్చా రాష్ట అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డితో, రైతులు,బీజేపీ నాయకులతో కలసి పరిసగిలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్, ప్రభుత్వం అధికారులు గత నెలరోజుల నుండి ఒడ్లు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చెయ్యక రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు తక్షణమే ధాన్యాన్ని కొనుగులు చేసి మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు ఈమేరకు బొమ్మలరామరం తహసీల్దార్ మూడురోజుల్లో పూర్తి ధాన్యాన్ని కొనుగులు చేస్తామని హామీ ఇచ్చారు లేని పక్షంలో తసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అన్నారు ఈకార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి,కిసనమోర్చా జిల్లా అధ్యక్షులు ఫకీరు రాజేందర్ రెడ్డి మండల అధ్యక్షులు వినోద్ నాయక్ జిల్లా నాయకులు, మండల నాయకులు రవీందర్ రెడ్డి నర్సింహ రెడ్డి మహేష్ గౌడ్ ఆనంద్ గౌడ్ నర్సింహ గౌడ్ పరిదా మహేశ్ యెల్లబోయిన భాస్కర్ చీర గణేష్ శశి రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, పరమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మే 20 దేశ వ్యాప్తసమ్మెలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొనాలి

*** సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ పిలుపు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మే 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెలో కొత్తగూడెం పట్టణంలో ఉన్నటువంటి అన్ని వర్గాల కార్మికులు వివిధ రంగాల్లో పనిచేస్తున్న శ్రామిక వర్గం అంతా మే 20న జరుగుతున్న దేశవ్యాప్త సమయంలో పాల్గొని జయప్రదం చేయాలని భూక్య రమేష్ పిలుపునిచ్చారు. కొత్తగూడెం పట్టణంలో ఆటో కార్మికుల వద్ద ,కార్ డ్రైవర్ కార్మికుల వద్ద, ఆర్టీసీ కార్మికుల వద్ద, ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ సంబంధించిన అన్ని అడ్డాల వద్ద సిఐటియు ఆధ్వర్యంలో గ్రూప్ మీటింగ్స్ నిర్వహించడం జరిగింది. ఈ మీటింగ్లలో భూక్య రమేష్ మాట్లాడుతూ ట్రాన్స్పోర్ట్ కార్మికులకు అన్యాయం చేసే విధంగా ప్రత్యక్ష పరోక్ష పన్నుల ద్వారా సంపాదించిన సంపాదన మొత్తం టాక్స్ లకే కట్టే విధంగా ఉన్నటువంటి చట్టాలన్నీ రద్దుచేసి ట్రాన్స్పోర్ట్ కార్మికులకు న్యాయం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు టాక్స్ల పేరుతో ఇన్సూరెన్స్ ల పేరుతో ఫైనాన్స్ పేరుతో... ఆర్థిక సమస్యలతో ఇప్పటికే సతమవుతమవుతున్న ట్రాన్స్పోర్ట్ కార్మికులందరికీ ప్రభుత్వమే ప్రత్యేకమైన పథకం ద్వారా సహకార్ ఏర్పాటుచేసి ఈ యాప్ ద్వారా ట్రాన్స్పోర్ట్ కార్మికులకు కిరాయిలు అందేలాగా ప్రజలకు అనుసంధానం చేస్తూ న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు ప్రమాదవశాత్తు మరణించిన ప్రతి కార్మికులకు ట్రాన్స్పోర్ట్ కార్మికులకు 10 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలని వారు కోరారు కార్మిక చట్టాల ప్రకారం సహాయం అందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం మీద ఉందని ఆయన తెలిపారు అటువంటి బాధ్యతను తప్పుకొని నాలుగు లేబర్ కోడ్ ల ను తీసుకువచ్చి ట్రాన్స్పోర్ట్ కార్మికులకు అన్యాయం చేసే విధంగా చేస్తున్న ప్రయత్నాన్ని తిప్పికొట్టేలా మే 20వ తేదీన దేశవ్యాప్త సమ్మె జరగబోతుందని భారతదేశ వ్యాప్తంగా ఉన్న కార్మిక వర్గం ట్రాన్స్పోర్ట్ కార్మికులందరూ ఈ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. నాలుగు లేబర్ కోడ్ లు రద్దు అయ్యే వరకు కార్మిక వర్గం అంతా ఐక్యంగా ఉద్యమించాలని కేంద్ర బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో ట్రాన్స్పోర్టు కార్మికులు గణేష్, రవి, నరసింహ, సైదులు, వీరస్వామి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## సుందరీమణుల కాళ్లను సాధారణ మహిళతో కడిగించడం అవమానకరం

*** మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి**




యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి : ప్రపంచ సుందరీమణులు వరంగల్ పర్యటన సందర్భంగా తెలంగాణ మహిళలను అవమానించేలా ఉన్న ప్రభుత్వ తీరుపై రాష్ట్ర మహిళా కమీషన్ కు ఫిర్యాదు చేసి ఈ ఘటనపై మహిళా కమీషన్ స్పందించి చర్యలు తీసుకోవాలనీ కోరిన మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యురాలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మరియు బిఆర్ఎస్ నాయకురాలు పాల్వాయి శ్రవంతి మరియు జిహెచ్ఎంసి కార్పొరేటర్లు ఇతర బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు, ఈ సందర్భంగా గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతు సుందరీమణుల కాళ్లను మంత్రులతో కడిగించకుండా సాధారణ మహిళతో కడిగించడం అవమానకరం తెలంగాణ మహిళల ఆత్మగౌరవాన్ని ప్రభుత్వం దెబ్బతీసింది అని అన్నారు.

## కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. సుప్రీం కీలక వ్యాఖ్యలు

దిల్లీ: హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? లేదా? అనేది స్పష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. లాంగ్ వీకెండ్ చూసి ఎందుకు చర్యలు మొదలు పెట్టారని ధర్మాసనం మరోసారి ప్రశ్నించింది. నష్టాన్ని పూడ్చేందుకు



తీసుకునే చర్యలను స్పష్టంగా చెప్పాలంది. కేంద్ర సాధికార సంస్థ దాఖలు చేసిన నివేదికపై కౌంటర్ దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది సమయం కోరారు. పర్యావరణానికి జరిగే నష్టాన్ని పూడ్చే చర్యలు చేపట్టకపోతే సీఎస్ సహా కార్యదర్శులు జైలుకు పోవాల్సి ఉంటుందని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా విజిల్ బ్లోయర్స్, విద్యార్థులపై కేసుల విషయాన్ని పలువురు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ కేసులు కొట్టివేయాలని అప్లికేషన్ దాఖలు చేసినట్లు తెలపగా.. ఈ పిటిషన్‌తో కలిపి విచారించడం కుదరదని సీజేఐ స్పష్టం చేశారు. కావాలనుకుంటే వేరే పిటిషన్ దాఖలు చేసుకోవచ్చన్నారు. అనంతరం తదుపరి విచారణను జులై 23కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

## రూ. 8వేల కోట్ల 'ఫీజు' బకాయిలు.. తక్షణమే చెల్లించాలి: సీఎంకు బండి సంజయ్ లేఖ

హైదరాబాద్: తక్షణమే ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ''ప్రభుత్వ నిర్లక్ష్యంతో రూ.8వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు కళాశాలలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడ్డాయి. కొన్ని కాలేజీలు ఫీజులు



చెల్లించనిదే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వట్లేదు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి''అని లేఖలో పేర్కొన్నారు.

# సోఫియా ఖురేషీ కుటుంబీకులపై దుష్ప్రచారం.. చర్యలకు హోంమంత్రి ఆదేశం!

భారత సైనికాధికారిణి కర్నల్ సోఫియా ఖురేషీ కుటుంబీకులపై సోషల్‌మీడియాలో దుష్ప్రచారం కలకలం రేపింది. సోఫియా ఖురేషీ అత్తింటిపై దాడి జరిగిందని 'ఎక్స్'లో నకిలీ పోస్ట్ వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలో సదరు 'ఎక్స్' ఖాతాదారుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ''బెళగావిలోని కర్నల్ సోఫియా ఖురేషీ అత్తమామల ఇంటిపై దాడి జరిగిందని ఓ 'ఎక్స్' ఖాతాలో నకిలీ పోస్టు బయటకు వచ్చింది. దీంతో అప్రమత్తమై వివరాలు సేకరించాం. ఆ 'ఎక్స్' ఖాతాదారుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశాం. ఈ పోస్ట్‌ను రీట్వీట్ చేసిన మరో ఇద్దరిపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేశాం. ప్రస్తుతం వారి గుర్తింపు వివరాలను ఇంకా ధ్రువీకరించలేదు'' అని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. కాగా సంబంధిత ప్రాంతంలో ఎటువంటి దాడి జరగలేదని.. కావాలనే సోషల్ మీడియాలో నకిలీ పోస్ట్ పెట్టినట్లు పోలీస్ సూపరింటెండెంట్ భీమశంకర్ గులేడ్ స్పష్టం చేశారు.



ప్రస్తుతం 'ఎక్స్' ఖాతా నుంచి ఆ పోస్ట్‌ను తొలగించగా.. అది కెనడాకు చెందిన ఎక్స్ అకౌంట్ అని పోలీసుల ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది. సోఫియా ఖురేషీ కుటుంబీకులపై నకిలీ పోస్టు పరిణామాల నేపథ్యంలో కర్ణాటక హోంమంత్రి జి. పరమేశ్వర ఎస్పీకి పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.. ''సోఫియా ఖురేషీ భర్తది బెళగావి. ఆమె అత్తామామల ఇల్లు ఇక్కడే ఉంది కావున నకిలీ పోస్ట్ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశాం. ఈ మేరకు తదుపరి చర్యల కోసం కేంద్రప్రభుత్వానికి తెలియజేశాం. ఇలాంటి పోస్టులు చేయడం రాష్ట్రానికి, దేశానికి అవమానకరం'' అని హోంమంత్రి చెప్పారు. ఇదిలా ఉంటే.. ముందస్తు భద్రతా చర్యల కోసం సోఫియా ఖురేషీ అత్తింటి వద్ద ఇద్దరు పోలీసులను ఏర్పాటు చేశారు. పాకిస్థాన్‌తో పోరుకు సంబంధించి కర్నల్ సోఫియా ఖురేషీ మీడియాకు పలు వివరాలు వెల్లడించిన విషయం తెలిసిందే.

# తుర్కియే సంస్థపై వేటు..
## 'సెలెబి' సెక్యూరిటీ క్లియరెన్స్ రద్దు




పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచిన తుర్కియేపై ఇప్పటికే దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమవుతుండగా.. తాజాగా కేంద్ర ప్రభుత్వం కూడా చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. మన దేశంలోని వివిధ విమానాశ్రయాల్లో భద్రతా పరమైన సేవలందిస్తున్న తుర్కియే సంస్థ సెలెబి ఏవియేషన్‌కు సెక్యూరిటీ క్లియరెన్స్ రద్దు చేసింది. జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకొని తక్షణమే ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని పేర్కొంటూ బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ ఆదేశాలు జారీ చేసింది. అంతకుముందు ఇదే అంశంపై పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు జమ్మూలో మాట్లాడుతూ.. జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇది భద్రతాపరమైన అంశమని, సంబంధిత ఏజెన్సీలతో మాట్లాడుతున్నామని చెప్పారు. ఇలా చెప్పిన కొన్ని గంటల్లోనే సదరు కంపెనీపై చర్యలు తీసుకుంటూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. తుర్కియేకు చెందిన సెలెబి ఏవియేషన్.. భారత్‌లోని పలు విమానాశ్రయాల్లో భద్రతాపరమైన సేవలు అందిస్తోంది. 'సెలెబీ ఎయిర్‌పోర్టు సర్వీసెస్ ఇండియా' పేరుతో గ్రౌండ్ హ్యాండ్లింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 'సెలెబీ ఢిల్లీ కార్గో టెర్మినల్ మేనేజ్‌మెంట్ ఇండియా' మాత్రం ఢిల్లీ విమానాశ్రయంలో కార్గో సేవలను అందిస్తోంది. అత్యంత కీలకమైన భద్రతా పనులను ఈ సంస్థ పర్యవేక్షిస్తుంది. గ్రౌండ్‌లో విమానాలకు నిర్దేశం చేసే ర్యాంప్ సర్వీసులు, విమాన సమతుల్యతను నిర్ధరించే లోడ్ కంట్రోల్, ప్రయాణికుల బోర్డింగ్‌కు అవసరమైన బ్రిడ్జిలను అనుసంధానం చేయడం, కార్గో, పోస్టల్, గోదాముల నిర్వహణ వంటి కీలక వ్యవహారాలను నిర్వహిస్తోంది. మరోవైపు పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన వేళ.. దాయాది దేశానికి తుర్కియే మద్దతుగా నిలిచిన విషయం తెలిసిందే. డ్రోన్లు, క్షిపణులను పాకిస్థాన్‌కు అందించిన ఆ దేశంపై భారత్ వ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. 'బాయ్‌కాట్ తుర్కియే' నినాదం జోరుగా సాగుతోంది. ఇప్పటికే ట్రావెల్ ఏజెన్సీలు అక్కడికి బుకింగ్‌లు నిలిపివేశాయి. పలు యూనివర్సిటీలు కూడా ఆ దేశంతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకున్నాయి. అక్కడ నుంచి దిగుమతయ్యే వస్తువులను నిషేధించాలనే డిమాండ్లు వస్తున్న నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# శత్రుమూకల్ని చీల్చి చెండాడిన 'ఆకాశ్'...
## ప్రహ్లాద రామారావు ప్రసాదమే



పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' ప్రపంచ వేదికపై మన సత్తాను చాటింది. ఉగ్ర లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించడమే కాకుండా.. ప్రత్యర్థి దాడులను సమర్థంగా తిప్పికొట్టింది. ఇందులో ఆకాశ్ క్షిపణులు కీలక భూమిక పోషించాయి. శత్రు డ్రోన్లను, క్షిపణులను నేల కూల్చాయి. భూతలం నుంచి గాల్లోకి ప్రయోగించే ఈ అస్త్రాలను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) రూపొందించింది. ఆకాశ్ క్షిపణి రూపుదిద్దుకోవడంలోనూ, భారత గగనతల రక్షణ వ్యవస్థ శత్రుదుర్భేద్యంగా మారడం వెనుక ఓ వ్యక్తి అవిరళ కృషి, పట్టుదల దాగి ఉన్నాయి. ఆయనే.. లెజండరీ డీఆర్‌డీవో శాస్త్రవేత్త 'ప్రహ్లాద రామారావు'.

### ఆయన జీవితం స్ఫూర్తిదాయకం

ప్రహ్లాద రామారావు కర్ణాటకలోని పేరున్న కుటుంబంలో 1947లో జన్మించారు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన తర్వాత ఆయనకు భారత్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, విక్రమ్ సారాభాయ్ స్పేస్ స్టేషన్ లో ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. కానీ, ఉద్యోగంలో చేరలేదు. తల్లి సలహా మేరకు ఉన్నత విద్య కోసం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ బెంగళూరులో చేరారు. అక్కడ చదువుతున్న రోజుల్లోనే డీఆర్‌డీఎల్ హైదరాబాద్‌లో ల్యాబ్‌లో పని చేసే అవకాశం వచ్చింది. అక్కడే భారత క్షిపణి పితామహుడిగా పేరొందిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను కలిశారు. అప్పటి నుంచి ఆయన్నే తన మెంటార్‌గా ఎంచుకున్నారు. ఆయన బృందంతోనే కలిసి పని చేశారు.

### యువకుడైనా అనుభవంలో మిన్న

1970ల చివర్లో 1980ల ప్రారంభంలో అబ్దుల్ కలాం బృందం ఓ అద్భుతమైన ప్రాజెక్టును చేపట్టింది. అదే ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిసైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్. అగ్ని, పృథ్వీ, ఆకాశ్, త్రిశూల్, నాగ్ అనే ఐదు క్షిపణి వ్యవస్థలను అభివృద్ధి చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. అప్పట్లో ఊహించని విధంగా కేంద్రం దీనికి రూ.300 కోట్లు మేర భారీ బడ్జెట్‌ను కేటాయించింది. 1983లో ఐజీఎండీపీ పూర్తి అనుమతులు పొందింది. అందులో ఆకాశ్ క్షిపణి వ్యవస్థ అభివృద్ధిని ప్రహ్లాద రామారావు తన భుజాలపైకి ఎత్తుకున్నారు. ఆయన పట్ల అపారమైన నమ్మకంతో అబ్దుల్ కలాం ఈ విభాగాన్ని ఆయనకు అప్పగించారు. ఈ ప్రాజెక్టు ప్రారంభమైన నాటికి రామారావు ఇంకా ముప్పైల్లోనే ఉన్నారు. ఈ ఐదు క్షిపణి వ్యవస్థల్లోనూ ఆకాశ్‌కు ప్రత్యేకస్థానం ఉంది. నేల నుంచి గాల్లోని లక్ష్యాలను ఛేదించే 'ఆకాశ్'పై ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్రం నుంచి కూడా ఒత్తిడి తీవ్రంగా ఉండేది. ఐజీఎండీపీ బడ్జెట్‌లోనూ దీనికే ప్రాధాన్యత ఇచ్చారు. క్షిపణి అభివృద్ధి పూర్తయిన తర్వాత 1990లో ట్రయల్స్ ప్రారంభమయ్యాయి. దశల వారీగా దానిని మెరుగుపరుస్తూ వచ్చారు. 2005 నాటికి గాల్లో వేగంగా వస్తున్న లక్ష్యాలను గుర్తించడంలో అత్యంత కచ్చితత్వం సాధించిన ఆకాశ్.. భారత్ అమ్ములపొదిలో అజేయ అస్త్రంగా నిలిచింది. దీనివెనుక ప్రహ్లాద రామారావు అవిరళ కృషి దాగి ఉందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

### ఆకాశ్ నా 'ముద్దు బిడ్డ'

ఆకాశ్ క్షిపణిని తన ముద్దు బిడ్డగా అభివర్ణిస్తారు ప్రహ్లాద రామారావు. అది తన లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఢీ కొట్టడం తన జీవితంలో గర్వించదగ్గ క్షణాల్లో ఒకటిగా చెబుతారు. 2000 సంవత్సరంలో డీఆర్‌డీవో నుంచి పదవీ విరమణ పొందిన ఆయన.. డిఫెన్స్ టెక్నాలజీ యూనివర్సిటీ పుణె ఉపకులపతిగా సేవలందించారు. ప్రపంచ ఇంధన సవాళ్లకు ఓ విప్లవాత్మకమైన పరిష్కారం కనుగొనేందుకు కోల్డ్ ఫ్యూజన్ రియాక్టర్‌పై ప్రస్తుతం పరిశోధనలు చేస్తున్నారు. తాజాగా పాకిస్థాన్‌పై ఆధిపత్యం చెలాయించడంలో ఆకాశ్ క్షిపణి పోషించిన పాత్రతో మరోసారి ఆయన పేరు దేశవ్యాప్తంగా ధ్వనిస్తోంది. భారతదేశంలోని పేరెన్నికగన్న శాస్త్రవేత్తల్లో ఒకరిగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. కేవలం ఆకాశ్ క్షిపణిలో మాత్రమే కాకుండా బ్రహ్మోస్ క్షిపణి తయారీలోనే ఆయన పాత్ర ఎనలేనిది. బ్రహ్మోస్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గానూ ఆయన పని చేశారు. ఆయన సేవలకు మెచ్చిన భారత ప్రభుత్వం 2015లో పద్మశ్రీతో సత్కరించింది.

# పీవోకేను అప్పగించకుంటే..
## మరిన్ని యుద్ధాలు తప్పవు అఠవాలే

పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేయాలని కేంద్ర మంత్రి రాందాస్ అఠావాలే పేర్కొన్నారు. అలా జరగకుంటే.. దాన్ని స్వాధీనం చేసుకునేందుకు మనం మరిన్ని యుద్ధాలు చేయాల్సి ఉంటుందన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై ప్రశంసలు గుప్పించిన ఆయన.. పాక్ ఆర్మీకి భారత సైన్యం తగిన గుణపాఠం చెప్పిందన్నారు. ''పాకిస్థాన్‌ను భారత్ తీవ్రంగా దెబ్బతీసింది. కాల్పుల విరమణ కొన్ని రోజులే ఉంటుంది. దాయాది దేశానికి మన సైన్యం తగిన గుణపాఠం చెప్పింది. పాక్‌లో తలదాచుకున్న 100 మంది ఉగ్రవాదులను చంపేశాం. అమెరికా అధ్యక్షుడి మధ్యవర్తిత్వంతో ఈ ఆపరేషన్‌ను ముగించలేదు. పీవోకేను భారత్‌కు అప్పగించాలని, ఉగ్ర కార్యకలాపాలను నిలిపివేయాలని పాక్ ముందు భారత్ ప్రతిపాదించింది'' అని కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి అఠవాలే పేర్కొన్నారు.



''కశ్మీర్ అంశంలో మూడో వ్యక్తి జోక్యం అవసరం లేదు. తూటాకు తూటా సమాధానం చెబుతుందనేది భారత వైఖరి. పీవోకే భారత్‌లో భాగమని గతంలో పార్లమెంటులోనూ చెప్పా. ఒకవేళ పాక్ దాన్ని అప్పగించకుంటే, తిరిగి స్వాధీనం చేసుకునేందుకు మనం మరిన్ని యుద్ధాలు చేయాల్సి ఉంటుంది'' అని అన్నారు. తాజా పరిణామాలను రాజకీయం చేయొద్దని విపక్ష పార్టీలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# జేఎన్‌యూ బాటలో.. జామియా మిలియా ఇస్లామియా

దిల్లీ: పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు మద్దతిచ్చిన తుర్కియేపై మన దేశంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే ఆ దేశంలోని ఇనొను యూనివర్సిటీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు దిల్లీలోని ప్రఖ్యాత జేఎన్‌యూ ఇది వరకే ప్రకటించగా.. తాజాగా జామియా మిలియా ఇస్లామియా వర్సిటీ కూడా అదే బాటలో పయనించింది. తుర్కియేలోని వివిధ విద్యాసంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను నిలిపివేసినట్లు ప్రకటించింది. ఈ మేరకు జేఎంఐ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ సైమా సయీద్ జాతీయ




మీడియాకు వెల్లడించారు. తమ దేశంలో భూకంపం సంభవించినపుడు భారత్ చేసిన మేలును మర్చిపోయిన తుర్కియే.. పాకిస్థాన్‌కు మద్దతివ్వడంపై దేశవ్యాప్తంగా ఆగ్రహం పెల్లుబికిన నేపథ్యంలో మన ట్రావెల్ ఏజెన్సీలు వెంటనే ఆ దేశానికి ఆన్‌లైన్ బుకింగ్‌లను నిలిపివేసిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా అక్కడి నుంచి దిగుమతి చేసుకుంటున్న కొన్ని రకాల పండ్లు, ఇతర పరికరాలను కూడా నిలిపివేశాయి. ఈ తరుణంలో స్పందించిన జేఎన్‌యూ ఇరుదేశాల యూనివర్సిటీల మధ్య ఇటీవల మూడేళ్లకుగానూ కుదిరిన విద్యాపరమైన ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో తుర్కియే సైనిక విమానాలను, యుద్ధనౌకను పాకిస్థాన్‌కు పంపించింది. అంతేకాకుండా పెద్ద మొత్తంలో డ్రోన్‌లను కూడా సాయం చేసినట్లు వార్తలు వచ్చాయి. ఆ ఆయుధాలనే పాకిస్థాన్ మనపైకి ప్రయోగించినట్లు కొన్ని ఆధారాలు కూడా లభ్యమయ్యాయి. ఈ నేపథ్యంలోనే బాయ్‌కాట్ తుర్కియే' పేరుతో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది. 'బ్యాన్ తుర్కియే' అంటూ పలువురు వ్యాపారులు కూడా ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులను విక్రయించేందుకు నిరాకరిస్తున్నారు.

## 'ఇంకేమీ డిసైడ్ కాలేదు.. ఇప్పుడు మాట్లాడటం తొందరపాటే'

కాల్పులు విరమణకు ఎవరు పిలుపునిచ్చారో స్పష్టంగా వెల్లడైందని పాకిస్థాన్‌ను ఉద్దేశించి విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. అలాగే చాలా వస్తువులపై భారత్ జీరో టారిఫ్‌లు ఆఫర్ చేసిందని అమెరికా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలకు సమాధానం ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్, భారత్‌పాక్ కాల్పుల విరమణ ఒప్పందం గురించి ఆయన మాట్లాడుతూ.. ''మేం ఆ దేశ మిలిటరీపై దాడి చేయలేదు. మే 7న వెనక్కి తగ్గడానికి ఇష్టపడనివారు.. మే 10న మాత్రం తగ్గారు. కాల్పుల విరమణ ఎవరు కోరుకున్నారో దీనిని బట్టి తెలుస్తోంది'' అని మంత్రి అన్నారు. ట్రంప్ 'జీరో టారిఫ్' వ్యాఖ్య.. మంత్రి రిప్లై భారత్‌అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. భారత్‌పాక్ ఉద్రిక్తతలకు తెరదించని పక్షంలో వాణిజ్యం నిలిపేస్తానంటూ ఇరుదేశాలకూ స్పష్టం చేశానని.. ఈ క్రమంలో అవి అంగీకారానికి వచ్చాయని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

# ఎంత బరువైనా మోసేయొచ్చు!

**శుభకార్యాలప్పుడు... అందంగా మెరిసిపోవాలని ఏ అమ్మాయి అనుకోదు చెప్పండి! అయితే, ఆ సమయంలో చటుక్కున పూర్తయ్యే మేకప్, మెరిసిపోయేందుకు సులువైన పరిష్కారాలు దొరికితే చాలు కదా! అలాంటివే ఇవి కూడా... ఓసారి ఇటు చూసేయండి.**

### క్రోమ్ నెయిల్ పౌడర్...

గోళ్లకు రంగు వేసుకోవాలంటే... ఇన్నాళ్లూ ద్రవరూపంలో ఉన్న పెయింట్‌నే చూసి ఉంటారు. ఇప్పుడిది పౌడర్ రూపంలోనూ దొరుకుతోంది. దీన్ని ఫైన్ మెటాలిక్ పిగ్మెంట్‌పౌడర్‌తో తయారు చేస్తారు. గోరుపై దాన్ని స్పాంజ్‌తో లేదా బ్రష్‌తో అద్దితే చాలు... మంచి షిమ్మర్ లుక్ వస్తుంది. ఇది సిల్వర్, గోల్డ్, రోజ్‌గోల్డ్, హోలోగ్రాఫిక్ వంటి రంగుల్లో దొరుకుతుంది.





### చూయింగ్ గ్లో పాట్:

లైట్ ఫార్ములాతో తీర్చిదిద్దిన ఈ పాట్‌పై వేలితో అద్ది పెదాలకు రాసుకుంటే చాలు... జ్యూసీగా మెరిసిపోతాయి. చూడ్డానికి ఈ పాట్ జెల్లీ పుడ్డింగ్‌లా కనిపిస్తుంది. పెదాలకు తగినంత తేమ అందించి పొడారకుండా చూస్తుంది. వేళ్లతో పెట్టుకోవడానికి ఇష్టపడనివారికోసం జతగా ఓ సిలికాన్ అప్లికేటర్ కూడా వస్తుంది. దీన్ని వాడుకోవచ్చు. భలేగా ఉంది కదూ!

### ఇన్‌విజిబుల్ సపోర్ట్ ఇయర్ చైన్స్...

పార్టీకో, ఫంక్షన్‌కో చక్కగా రెడీ అవుతాం. భారీగా చెవిపోగులు పెట్టుకుంటేనే కానీ నిండుదనం రాదనిపిస్తుంది. కానీ వాటి బరువుకి చెవి తమ్మె సాగడం, తలనొప్పి, అసౌకర్యం... వంటి సమస్యలెన్నో ఎదురవుతాయి. ఈ ఇబ్బంది రాకుండా ఉండాలంటే ఈ ఇన్‌విజిబుల్ సపోర్ట్ ఇయర్ చైన్స్ వాడండి. చూడ్డానికి మ్యాటీలా కనిపించే ఇవి చెవికి పట్టి ఉండి బరువుని ఆపుతాయి. బయటకీ కనిపించవు.



# రంగు రంగుల పూలు.. రమ్యంగా ఇల్లు!

**ఇంటిని పొదరిల్లులా మార్చే తీగ మొక్కకు రంగు రంగుల పూలు పూస్తే... ఎంత నిండుగా కనిపిస్తుందో కదా? అలాంటి రకమే థన్‌బెర్గియా. మరి దీన్ని ఎలా పెంచుకోవాలో తెలుసా?**

థన్‌బెర్గియా అనేది అకాంతసీ కుటుంబానికి చెందిన పూల మొక్క. స్వీడిష్ ప్రకృతి శాస్త్రవేత్త కార్ల్ పీటర్ థన్‌బర్గ్ గౌరవార్థం ఈ పేరు పెట్టారట. క్లాక్‌వైన్, బ్లాక్ ఐడ్ సుసాన్ అనే పేర్లతోనూ దీన్ని పిలుస్తారు. ఇందులో వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 150 వరకూ జాతులు ఉన్నాయి. ఈ మొక్క సుమారు రెండు నుంచి ఎనిమిది మీటర్ల ఎత్తు వరకూ పెరుగుతుంది. పర్గోలాలు, పోర్టికోలు, బాల్కనీలు... ఒకటేమిటి అన్నింటి మీదకూ సులువుగా పాకుతుంది.

**ఎన్ని రంగులో...**

థన్‌బెర్గియాను వేలాడే కుండీల్లో పెంచుకుంటే భలేగా కనిపిస్తుంది. అయితే, ఈ మొక్క చక్కగా ఎదగాలంటే పూర్తి ఎండ అవసరం. మంచుని తట్టుకోలేదు. నీడలో పూలు రావు. దీనికి వచ్చే గుండ్రని, బలమైన కాడలకు ఐదారు రేకలతో ట్రంఫెట్ ఆకృతిలో పూలు విచ్చుకుంటాయి. ఇవి నారింజ, పసుపు, ఎరుపు, క్రీమీ, తెలుపు రంగుల్లో కనువిందు చేస్తాయి. పువ్వుకి మధ్యలో ముదురు చాక్లెట్, ఊదారంగు ఏర్పడటం వల్ల భలే అందంగానూ కనిపిస్తాయి.

**చీడపీడలు లేకుండా...**

ఈ పూల మొక్క ఆరోగ్యంగా పెరగడానికి నాటే మట్టి నాణ్యంగా ఉండాలి. ముఖ్యంగా మరీ పొడిగా లేదా తడిగా ఉండకుండా చూసుకోవాలి. కుండీల్లో పర్లైట్ లేదా వర్మిక్యులైట్ జోడించి, కంపోస్ట్ కలిపిన మట్టి నింపుకోవాలి. ఇక, ఒకటి కంటే ఎక్కువ మొక్కల్ని పెంచాలనుకున్నప్పుడు వాటి మధ్య కనీసం ఒక అడుగు దూరం ఉండేలా చూసుకోవాలి. విత్తనాల ద్వారా మొలకెత్తించాలంటే కనీసం 21 రోజుల సమయం పడుతుంది. థన్‌బెర్గియా బలంగా నాటుకోవాలన్నా, పూలు ఎక్కువగా పూయాలన్నా తగిన ఎరువులు అందించాలి. కనీసం నెలరోజులకోసారైనా మొదళ్లలో మట్టి పెకిలించి కాస్త కంపోస్ట్ కలపాలి. సమాన నిష్పత్తిలో ఎన్‌పీకే సమగ్ర ఎరువుని అందించాలి. వీటికి చీడపీడల సమస్య తక్కువే. అరుదుగా తెల్లదోమ, సాలీడు పురుగులు వస్తాయి. వాటిని వదిలించడానికి వేపనూనెను పిచికారీ చేయండి.









## భారత్‌లో యాపిల్ సంస్థను విస్తరించొద్దు..



### టిమ్ కుక్‌కు సూచించిన ట్రంప్

**న్యూఢిల్లీ:** ఖతార్ వేదికగా భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన అక్కసు వెళ్లగక్కారు. భారత్‌లో యాపిల్ సంస్థను విస్తరించొద్దని ఆ సంస్థ సీఈవో టిమ్ కుక్ కు సూచించారు. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంపే స్వయంగా వెల్లడించినట్లు బ్లూమ్‌బర్గ్ నివేదికను ఉటంకిస్తూ ప్రముఖ జాతీయ మీడియా ఇండియా టుడే తెలిపింది.

అధ్యక్షుడు ట్రంప్ ప్రస్తుతం అరబ్ దేశాల పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. తన పర్యటనలో భాగంగా నిన్న ఖతార్‌ను సందర్శించారు. ట్రంప్ కోసం ఎమిర్ ఆఫ్ ఖతార్ దోహాలో ప్రత్యేకంగా విందు ఏర్పాటు చేసింది. ఈ విందుకు పలువురు సీఈవోలు, వ్యాపారవేత్తలు హాజరయ్యారు. ఈ విందుకు హాజరైన యాపిల్ సీఈవో టిమ్ కుక్‌తో ట్రంప్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తన అభిప్రాయాన్ని టిక్ కుక్‌కు తెలియజేశారు. భారత్‌లో యాపిల్ సంస్థను విస్తరించొద్దని సూచించారు.'నాకు టిమ్ కుక్‌తో నిన్న చిన్న సమస్య ఎదురైంది. అతడు భారత్‌లో తయారీ కర్మాగారాల నిర్మాణాలు చేపట్టారు. అలా చేయడం నాకు ఇష్టం లేదని చెప్పాను. ఫలితంగా అమెరికాలో ఉత్పత్తి పెంచేందుకు యాపిల్ అంగీకరించింది. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి. అక్కడ వ్యాపారం చేయడం చాలా కష్టమని టిమ్ కుక్‌కు వివరించా. భారత్ కోసం ఆలోచించాల్సిన అవసరం లేదు. ఆ దేశం తనను తాను చూసుకోగలదని చెప్పా. నా వల్ల యాపిల్ సంస్థ ఇప్పుడు యూఎస్‌లో 500బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని యోచిస్తోంది' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

అమెరికా , చైనా దేశాల మధ్య టారిఫ్‌ల యుద్ధం కారణంగా దిగ్గజ సంస్థ యాపిల్‌ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతోంది. ఇందులో భాగంగానే అమెరికా మార్కెట్లో విక్రయించే ఐఫోన్ల తయారీకి సంబంధించిన పూర్తి అసెంబ్లీని భారత్‌కు తరలించాలని కంపెనీ యోచిస్తోంది. వచ్చే ఏడాది సాధ్యమైనంత తొందరగానే అమెరికా ఫోన్‌లకు సంబంధించిన యాపిల్ ఐఫోన్ అసెంబ్లీ భారత్‌కు తరలించే అవకాశం ఉందని గత కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్ వంటి సంస్థలు ఇప్పటికే భారత్‌లో ఐఫోన్ అసెంబ్లింగ్ చేస్తున్న విషయం తెలిసిందే. జూన్ త్రైమాసికంలో అమెరికాలో విక్రయించే ఐఫోన్లలో అత్యధికంగా భారత్‌లో తయారైనవే ఉంటాయని టిమ్ కుక్ ఇటీవల ప్రకటించారు. ఐపాడ్స్, మ్యాక్‌బుక్, యాపిల్ వాచ్‌లు, ఎయిర్‌పాడ్స్ వంటి ఉత్పత్తులను మాత్రం వియత్నాం నుంచి దిగుమతి చేసుకోవాలని యాపిల్ భావిస్తోంది.

## దేశంలోని తొలిసారిగా.. ఒక నెలలోనే రికార్డు సృష్టించిన వాహనాల అమ్మకాలు!



**న్యూఢిల్లీ:** ఇక్కడ టాటా మోటార్స్ ఎలక్ట్రిక్ ట్రాన్స్‌పోర్టేషన్ సొల్యూషన్ ప్రొవైడర్ వెర్టెలోతో చేతులు కలిపింది. టాటా మోటార్స్ అన్ని ఎలక్ట్రిక్ వాణిజ్య వాహన విభాగాలలో అద్దె సేవల కోసం రెండు కంపెనీలు ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయని టాటా మోటార్స్ ఒక ప్రకటనలో తెలిపింది. దేశంలో ప్రయాణికుల వాహనాల హోల్‌సేల్ అమ్మకాలు ఏప్రిల్‌లో 4 శాతం పెరిగి 3,48,847 యూనిట్లకు చేరుకున్నాయి. పరిశ్రమల సంస్థ గురువారం విడుదల చేసిన తాజా డేటాలో వెల్లడైంది. ఏప్రిల్ 2024లో ప్యాసింజర్ వాహనాల హోల్‌సేల్ అమ్మకాలు 3,35,629 యూనిట్లుగా ఉన్నాయి. భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం (%సాxూవీ%) డైరెక్టర్ జనరల్ రాజేష్ మీనన్ మాట్లాడుతూ.. ప్యాసింజర్ వాహన విభాగం ఏప్రిల్ 2025లో ఇప్పటివరకు అత్యధికంగా 3.49 లక్షల యూనిట్ల అమ్మకాలను నమోదు చేసిందని, ఇది ఏప్రిల్ 2024తో పోలిస్తే 3.9 శాతం ఎక్కువని చెప్పారు.

విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం.. ఏప్రిల్‌లో మొత్తం ద్విచక్ర వాహనాల అమ్మకాలు గత సంవత్సరంతో పోలిస్తే 17 శాతం తగ్గి 14,58,784 యూనిట్లకు చేరుకున్నాయి. ఏప్రిల్ 2024లో బైక్‌లు, స్కూటర్లు, మోపెడ్‌ల హోల్‌సేల్ అమ్మకాలు 17,51,393 యూనిట్లుగా ఉన్నాయి. గత నెలలో స్కూటర్ అమ్మకాలు 5,48,370 యూనిట్లుగా ఉన్నాయి. ఇది ఏప్రిల్ 2024లో 5,81,277 యూనిట్ల నుండి ఆరు శాతం తగ్గింది. మోటార్‌సైకిల్ అమ్మకాలు ఏప్రిల్‌లో వార్షిక ప్రాతిపదికన 23 శాతం తగ్గి 8,71,666 యూనిట్లకు చేరుకున్నాయి. మోపెడ్‌ల హోల్‌సేల్ అమ్మకాలు గత ఏడాది ఇదే కాలంలో 41,924 యూనిట్లతో పోలిస్తే ఎనిమిది శాతం తగ్గి 38,748 యూనిట్లకు చేరుకున్నాయి.

ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాల కోసం ఆన్-బోర్డ్ డయాగ్నస్టిక్స్ 2 నిబంధనల రెండవ దశ కోసం ఆటోమోటివ్ పరిశ్రమ ఏప్రిల్ 2025 నుండి కొత్త నియంత్రణ విధానానికి మారడం ప్రారంభించిందని మీనన్ చెప్పారు. దీనితో పాటు ఈ నెల నుండి దేశవ్యాప్తంగా - 20 పెట్రోల్ వాహనాలు కూడా ప్రవేశపెట్టాయి. 20 పెట్రోల్ వాహనాలు అనేవి 20 ఇంధనాన్ని (20 శాతం ఇథనాల్, 80 శాతం పెట్రోల్ మిశ్రమం) ఉపయోగించగల పెట్రోల్ వాహనాలు.

### ఎలక్ట్రిక్ వాహనాలను అద్దెకు తీసుకోవచ్చు:

ఇక్కడ టాటా మోటార్స్ ఎలక్ట్రిక్ ట్రాన్స్‌పోర్టేషన్ సొల్యూషన్ ప్రొవైడర్ వెర్టెలోతో చేతులు కలిపింది. టాటా మోటార్స్ అన్ని ఎలక్ట్రిక్ వాణిజ్య వాహన విభాగాలలో అద్దె సేవల కోసం రెండు కంపెనీలు ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయని టాటా మోటార్స్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రజలకు విద్యుత్ రవాణాను అందుబాటులోకి తీసుకురావడంలో వెర్టెలోతో ఈ భాగస్వామ్యం ఒక ముఖ్యమైన అడుగు అని టాటా మోటార్స్ వాణిజ్య వాహన విభాగం వైస్ ప్రెసిడెంట్ రాజేష్ కౌల్ అన్నారు.

# టెస్టుల్లో సంచలనం..

### నంబర్ 1 ఆల్‌రౌండర్‌గా ఆల్‌టైమ్ రికార్డు..!

**న్యూఢిల్లీ:** భారత సీనియర్ క్రికెటర్ రవీంద్ర జడేజా టెస్టుల్లో చెక్కుచెదరనిరికార్డు నెలకొల్పాడు. అత్యధిక రోజులు నంబర్ 1 ర్యాంక్‌లో కొనసాగిన ఆల్‌రౌండర్‌గా జడ్డూ చరిత్ర సృష్టించాడు. మూడేళ్ల క్రితం అగ్రస్థానం కైవసం చేసుకున్న జడేజా ఇప్పటికీ టాప్‌లోనే ఉన్నాడు. మే 14వ తేదీ నాటికి అతడు నంబర్ 1గా 1,151 రోజులు పూర్తి చేసుకున్నాడు. 144 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో ఇంతకాలం అగ్రస్థానంలో ఉన్న ఆల్‌రౌండర్ జడేజానే కావడం విశేషం.

జడేజా 2022 మే 9న ఐసీసీ పురుషుల టెస్టు ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో ప్రథమ స్థానం సాధించాడు. వెస్టిండీస్ ఆల్‌రౌండర్ జేసన్ హోల్డర్‌ను దాటేసి అతడు మొదటి ర్యాంక్ సొంతం చేసుకున్నాడు. ప్రస్తుతం టీమిండియా హీరో ఖాతాలో 400 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. బంగ్లాదేశ్ కుర్రాడు మెహిదీ హసన్ మిరాజ్ 327 రేటింగ్స్‌తో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

సుదీర్ఘ ఫార్మాట్‌లో జడేజా టీమిండియాకు కొండంత ఆస్తిలా మారాడు. బ్యాటుతో, బంతితో రాణిస్తూజట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడీ సీనియర్ ఆల్‌రౌండర్. ఇప్పటివరకూ 80 టెస్టులు ఆడిన జడ్డూ 3,370 పరుగులు సాధించాడు. నాలుగు శతకాలు, 22 అర్ధ సెంచరీలు అతడి బ్యాట్ నుంచి జాలువారాయి. ఇక బంతితో ప్రత్యర్థి బ్యాటర్లను ఇరుకున పెడుతూ 323 వికెట్లు పడగొట్టాడు జడ్డూ. ఏకంగా 13సార్లు నాలుగు వికెట్లు.. 14 సార్లు 5 వికెట్ల ప్రదర్శన కనబరిచాడీ లెఫ్ట్ హ్యాండర్.

### జడ్డూనే కీలకం

గత పదేళ్లలో స్పిన్నర్ అశ్విన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు లేకుండా తొలిసారి భారత జట్టు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. అక్కడ జరుగబోయే 5 టెస్టుల సిరీస్‌లో టీమిండియాకు జడేజా కీలకం కానున్నాడు. అక్కడి పరిస్థితులపై అవగాహన ఉన్న ఈ ఆల్‌రౌండర్ స్పిన్ యూనిట్‌ను సమర్థంగా నడిపించే బాధ్యత తీసుకోనున్నాడు. అంతేకాదు కుర్రాళ్లలో ఆత్మవిశ్వాసం నింపుతూ పెద్దన్నలా వ్యవహరించాల్సి ఉంటుంది.







## 'సన్నీ'కి అరుదైన గౌరవం..

### బీసీసీఐ కార్యాలయంలో ప్రత్యేక బోర్డ్‌రూమ్




**న్యూఢిల్లీ:** క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ అరుదైన గౌరవం దక్కింది. భారత క్రికెట్‌కు విశేష సేవలందించిన లిటిల్ మాస్టర్ కోసం ప్రత్యేక బోర్డు రూమ్‌ను ఏర్పాటు చేసింది బీసీసీఐ. ముంబైలోని ప్రధాన కార్యాలయంలో 1,000 గవాస్కర్ బోర్డ్ రూమ్‌ను గురువారం బీసీసీఐ ప్రారంభించింది. ఆ వీడియోను ఎక్స్ వేదికగా అభిమానులతో పంచుకుంది బోర్డు. టెస్టుల్లో పదివేల పరుగులు చేసిన మొదటి భారత క్రికెటర్ అయిన సన్నీ గౌరవార్థం ఈ గదిని ఏర్పాటు చేశామని బీసీసీఐ తెలిపింది.

తొలి తరం క్రికెటర్లలో ఒకడైన గవాస్కర్ మేటి ఓపెనర్‌గా పేరు గడించాడు. తన విధ్వంసక ఆటతో అలరించిన సన్నీ.. టెస్టుల్లో 10 వేల పరుగులతో చరిత్ర లిఖించాడు. రిటైరయ్యాక కామెంటేటర్‌గానూ రాణిస్తున్న గవాస్కర్‌కు గురువారం బీసీసీఐ ఊహించని కానుక ఇచ్చింది. అతడి పేరుతో బోర్డ్ రూమ్ ఏర్పాటు చేసింది. గదినిండా గవాస్కర్ ఫొటోలు, అతడి కాలంలో టీమిండియా గెలుపొందిన ట్రోఫీలను పొందుపరిచింది బీసీసీఐ. ఈ సందర్భంగా గవాస్కర్ భావోద్వేగానికి లోనయ్యాడు.'ముంబై క్రికెట్ అసోసియేషన్ నాకు తల్లితో సమానం. ఇక బీసీసీఐ అయితే తండ్రి లెక్క. ఈ గౌరవానికి ధన్యవాదాలు. భారత్‌కు ఆడే అవకాశం వచ్చినందుకు.. నన్ను ఈ స్థాయికి చేర్చినందుకు భారత క్రికెట్‌కు రుణపడి ఉంటాను. ఇది నాకు చాలా పెద్ద గౌరవం. ఈ సందర్భంగా బీసీసీఐకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. నా వంతుగా బీసీసీఐ, భారత క్రికెట్ కోసం ఏదైనా చేయాలనుకుంటున్నా' అని సన్నీ వెల్లడించాడు. 1000 గవాస్కర్ బోర్డ్‌రూమ్ ప్రారంభోత్సవంలో బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, సెక్రటరీ దేవజిత్ సైకియాలు పాల్గొన్నారు.

### 1987లో పాకిస్థాన్‌పై..

ప్రపంచ క్రికెట్‌లో వెస్టిండీస్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ ఆటగాళ్ల ఆధిపత్యం నడుస్తున్న రోజుల్లో గవాస్కర్ టీమిండియాకు ఆణిముత్యంలా దొరికాడు. ఓపెనర్‌గా విధ్వంసక ఇన్నింగ్స్‌లతో అందరి దృష్టిని ఆకర్షించడు. 1971 నుంచి 1987 మధ్యకాలంలో ఎన్నో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌లు ఆడాడు. ప్రపంచంలోని గొప్ప బ్యాటర్లలో ఒకడిగా చరిత్రపుటల్లో పేరు సంపాదించాడు.

## జూన్‌లో ఇంగ్లండ్ పర్యటన..

### లేడీ సెహ్వాగ్‌కు పిలుపు..!

**న్యూఢిల్లీ:** ముక్కోణపు సిరీస్ విజయోత్సాహంలో ఉన్న భారత మహిళల జట్టు మరో సిరీస్‌కు సిద్ధమవుతోంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా జూన్‌లో ఇంగ్లండ్ పర్యటన లో వన్డే, టీ20 సిరీస్ ఆడనుంది. దాంతో, ఈ పర్యటన కోసం భారత సెలెక్టర్లు గురువారం స్క్వాడ్‌ను ప్రకటించారు. 'లేడీ సెహ్వాగ్'గా పేరొందిన షఫాలీ వర్మ టీ20 స్క్వాడ్‌లో చోటు దక్కించుకుంది. తద్వారా దాదాపు ఏడాది విరామం తర్వాత షఫాలీ నీలిరంగు జెర్సీ వేసుకోనుంది. ఇంగ్లండ్ పర్యటనలో భారత్.. 5 టీ20లు, 3 వన్డేలు ఆడనుంది. సుదీర్ఘమైన ఈ సిరీస్ కోసం సెలెక్టర్లు సీనియర్లతో, ఆల్‌రౌండర్లతో కూడిన పటిష్ఠమైన స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. ఈమధ్యే శ్రీలంక గడ్డపై ముగిసిన ముక్కోణపు సిరీస్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన విజయంలో కీలక పాత్ర పోషించిన స్నేహ్ రానా రెండు ఫార్మట్లకు ఎంపికైంది.



## సెలెక్టర్లతో కీలక సమావేశం..

### సిద్ధివినాయకుడి సన్నిధిలో గంభీర్

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ పర్యటనకు కోసం భారత జట్టు ఎంపికపై సెలెక్టర్లు కసరత్తు ప్రారంభించారు. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు రిటైర్ కావడంతో.. జూనియర్లతో పటిష్ఠమైన స్క్వాడ్‌ను ఇంగ్లండ్ పంపాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో హెడ్‌కోచ్ గౌతం గంభీర్ గురువారం ముంబైలోని సిద్ధి వినాయక ఆలయాన్ని సందర్శించాడు. ప్రత్యేక పూజుల చేసిన గౌతీ అనంతరం గణేశుడి ఆశీస్సులు తీసుకున్నాడు. ఇంగ్లండ్ పర్యటనకు జట్టు ఎంపిక గురించి కోచ్ గంభీర్ గురువారం సాయంత్రం సెలెక్టర్లతో సమావేశం అయ్యే అవకాశముంది.

నిరుడు టీ20 వరల్డ్ కప్ తర్వాత కోచ్‌గా నియమితుడైన గంభీర్.. శ్రీలంక పర్యటనలో విజయవంతం అయ్యాడు. కానీ స్వదేశంలో న్యూజిలాండ్ జట్టు టీమిండియాను వైట్‌వాష్ చేసింది. ఆ తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై భారత జట్టు పరాజయంతో గౌతీ కోచింగ్‌పై పెదవి విరుస్తున్నారు మాజీ ఆటగాళ్లు, అభిమానులు. కాబట్టి.. జూన్‌లో ఇంగ్లండ్‌తో 5 టెస్టుల సిరీస్ అతడికి సవాల్ కానుంది. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్టులకు వీడ్కోలు పలకడంతో గంభీర్ జూనియర్లతోనే అద్భుతాలు చేయాల్సి ఉంటుంది.



### సాయి, కరుణ్‌కు ఛాన్స్

ఇంగ్లండ్ పర్యటనతో భారత జట్టు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ కొత్త సైకిల్‌ను మొదలు పెట్టనుంది. దాంతో, విజయంతో తొలి అడుగు వేయాలని భావిస్తున్న కోచ్ గంభీర్.. కొత్త కెప్టెన్, వైస్ కెప్టెన్ ఎంపకిపై దృష్టి సారించారు. కోహ్లీ, హిట్‌మ్యాన్ లేని లోటును పూడ్చగలిగే ఆటగాళ్లకు సెలెక్టర్లు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈమధ్య దేశవాళీలో, ఐపీఎల్‌లో.. పరుగుల వరద పారిస్తున్న సాయి సుదర్శన్ కరుణ్ నాయర్‌లకు స్క్వాడ్‌లో చోటు దక్కే వీలుంది.



## టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్‌గా భాగ్యశ్రీ..

టాకీస్: భాగ్యశ్రీ బోర్సే.. రవితేజ హీరోగా వచ్చిన మిస్టర్ బచ్చన్ సినిమాలో హీరోయిన్‌గా టాలీవుడ్ అరంగ్రేటం చేసి తన అందం, సొగసు వలవేసి తెలుగు కుర్రాళ్ల మనసు దోచేసింది. దీంతో తెలుగు ఈ బ్యూటీకి విపరీతంగా క్రేజ్ పెరిగిపోయింది. ప్రస్తుతం వరుస సినిమాలతో తెలుగులో బిజీ అయిపోయింది. రవితేజ హీరోగా వచ్చిన మిస్టర్ బచ్చన్ సినిమాతో హీరోయిన్‌గా టాలీవుడ్ అరంగ్రేటం చేసింది సొగసరి భామ భాగ్యశ్రీ బోర్సే. ఈ సినిమా డిజాస్టర్ అయినప్పటికీ.. తన అందం, సొగసు చూపి తెలుగు కుర్రాళ్ల క్రాష్ లిస్ట్‌లో చేరిపోయింది ఈ బ్యూటీ. దీంతో ఈ ముద్దుగుమ్మకి తెలుగులో వరుస అవకాశాలు క్యూ కట్టాయి. ప్రస్తుతం ఒకటి విజయ్ దేవరకొండకి జోడిగా నటించిన కింగ్‌డమ్ మూవీ షూటింగ్ కంప్లైట్ అయింది. ఇది ఈ ఏడాది జులై 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే దుల్కర్ సల్మాన్ సరసన కాంత అనే పీరియడ్ డ్రామా సినిమా చేస్తుంది ఈ బ్యూటీ. సెల్వమణి సెల్వరాజ్ ఈ చిత్రానికి దర్శకుడు. రానా దగ్గుబాటి, ప్రశాంత్ పొట్లూరి, దజోన్ వర్గీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. వీటితో పాటు రామ్ పోతినేని హీరోగా తెరకెక్కుతున్న ఆంధ్ర కింగ్ తాలూకా సినిమాలో కథానాయికగా నటిస్తుంది భాగ్యశ్రీ. బయోపిక్ అఫ్ ఫ్యాన్ అనే ట్యాగ్‌లైన్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి ఫేమ్ దర్శకుడు పి. మహేష్ బాబు. చేతిలో ఉన్న ఈ మూడు సినిమా కంప్లీట్ అవ్వకముందే ప్రభాస్ సరసన ఓ సినిమాలో హీరోయిన్‌గా సెలెక్ట్ అయింది అనే సమాచారమే.
ఇది నిజమైతే భాగ్యశ్రీ స్టార్ అయిపోవడం పక్క. చూడాలిక టాలీవుడ్‌లో ఈమె జర్నీ ఎలా సాగనుందో.



## సతీమణి శ్యామాలి పోస్ట్ వైరల్

## రాజ్‌తో సమంత..

టాకీస్: టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత వ్యాక్తిగత జీవితం గురించి రోజుకో వార్త వైరల్ అవుతూనే ఉంటోంది. ఎంతో ప్రేమించిన అక్కినేని నాగచైతన్యతో విడాకుల తర్వాత సింగిల్‌గా ఉంటుంది సమంత. నాగచైతన్య రెండో పెళ్లి చేసుకోని హ్యాపి లైఫ్ లీడ్ చేస్తున్నప్పటికి సమంత కూడా రెండో పెళ్లి చేసుకుంటే బాగుంటుందని అభిమానులు, సినీ ప్రియులు కోరుకుంటు-న్నారు. అయితే కొద్ది రోజులుగా దర్శకుడు రాజ్
నిడిమోదుతో తరచు కనిపిస్తోంది సామ్.. ఎక్కడికి వెళ్లిన సమంత పక్కన రాజ్ ఉంటున్నాడు. దీంతో ఆమె వైవాహిక జీవితం పై నెట్టింట రూమర్స్ గట్టిగానే ప్రచారం అవుతున్నాయి. అయితే రాజ్ నిడిమోరుకు ఇప్పటికే పెళ్లి అయ్యింది. ఇలాంటి టైం లో తాజాగా సమంత తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ షేర్ చేసింది. ఇందులో రాజ్‌పై సమంత వాలినట్టుగా కనిపిస్తుంది. దీంతో ఈ వార్తలు మరింత పుంజుకున్నాయి. వారి బాండింగ్ రోజు రోజుకి బలపడుతుందిగా అని కొందరు కామెంట్ చేస్తున్నారు. ఈ ఫోటో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. అయితే తాజాగా రాజ్ సతీమణి శ్యామాలి తాజాగా ఎక్స్ వేదికగా ఒక సందేశాత్మక పోస్ట్ పెట్టింది.. 'నా గురించి ఆలోచించి, విని, మాట్లాడేవారితోపాటు నన్ను కలిసి, నాతో మాట్లాడి నా గురించి రాసే వారందరికి ప్రేమ, ఆశీస్సులు పంపుతున్నా' అనే పోస్ట్ ను ఆమె షేర్ చేశారు. ప్రస్తుతం ఇది నెట్టింట వైరల్ గా మారింది. కొంతకాలంగా ఎలాంటి పోస్ట్ షేర్ చేయని ఆమె ఉన్నట్టుండి ఇలాంటి సందేశం ఎందుకు షేర్ చేశారా? అని, ఆమె కచ్చితంగా సమంతని ఉద్దేశించే మాట్లాడుతూంది అని కామొంట్ లు విపడుతున్నాయి

## వరుస ఆఫర్స్‌తో దూసుకుపోతున్న తెలుగమ్మాయి సాన్వే మేఘన

టాకీస్: ఇండస్ట్రీలో ఇప్పుడు తెలుగు అమ్మాయిలు రాణిస్తున్నారు. మంచి అవకాశాలు అందుకుంటూ దూసుకుపోతున్నారు. వారిలో సాన్వే మేఘన ఒకరు. సాన్వే మేఘన 1998 సెప్టెంబరు 12న హైదరాబాద్‌లో జన్మించింది. ఈ ముద్దుగుమ్మ. ఈ ముద్దుగుమ్మ 2019లో "సైరా నరసింహారెడ్డి" సినిమాతో తన సినీ జర్నీని ప్రారంభించింది. ఆ తర్వాత "పిట్ట కథలు" , "బిలాల్‌పూర్ పోలీస్ స్టేషన్", "పుష్పక విమానం", "మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్" వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. "పుష్పక విమానం"లో ఆమె షార్ట్ ఫిల్మ్ హీరోయిన్‌గా చేసిన పాత్ర ప్రేక్షకులను మెప్పించింది. తెలుగులో ఈ అమ్మడు ఇప్పటివరకు ఆరు సినిమాలు చేసింది.

అలాగే తమిళ్ లో ఓ సినిమా చేసింది. తమిళ్ లో ఆమె కుటుంబస్థాన్ అనే సినిమాలో నటించింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. తెలుగులో రీసెంట్ గా టుక్ టుక్ అనే సినిమా చేసింది. చేసిన సినిమాలన్ని మంచి టాక్ సొంతం చేసుకున్నా ఈ భామకు మాత్రం అంతగా గుర్తింపు రాలేదు. రీసెంట్ గా తమిళ్ లో ఓ సినిమా చేసింది.

ఆ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా తర్వాత ఈ చిన్నదానికి తమిళ్ నుంచి క్రేజీ ఆఫర్స్ వస్తున్నాయి. ఇప్పటికైన తెలుగులో ఈ అమ్మడికి పెద్ద సినిమా ఆఫర్స్ వస్తాయేమో చూడాలి.



## నా కథ సినిమాగా వస్తూ చూడాలని ఉంది: భజ్జీ

టాకీస్: భారత క్రికెట్ చరిత్రలో అత్యంత గొప్ప బౌలర్లలో హర్భజన్ సింగ్ ఒకరు. తన స్పిన్ బౌలింగ్‌తో పాటు-, కీలక సమయాల్లో బ్యాటింగ్‌తోనూ ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించాడు. 'టర్బనేటర్'గా పిలువబడే హర్భజన్ క్రికెట్ కెరియర్ సినిమాటిక్ గా ఉంటుందని దాన్ని వెండితెరపై చూపిస్తే వర్కవుట్ అవుతుందని కొందరి ఒపీనియన్. రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో భజ్జీ తన జీవిత కథ సినిమాగా వస్తే చూడాలని ఉందన్నాడు. అంతేకాకుండా తన రోల్ కు పాత్రకు న్యాయం చేయాలని భావిస్తున్న ఇద్దరు హీరోల పేర్లను వెల్లడించాడు.అందుల్లో ఒకరు విక్కీ కౌశల్ మరొకరు రణవీర్ సింగ్. తన పాత్రకు వీరైతేనే బాగుంటుందని చెబుతున్నాడు. ఇప్పటికే కపిల్ బయోపిక్ 83లో రణ్ వీర్ సింగ్ కపిల్ దేవ్ గా కనిపించాడు. బహుశా ఇదే రన్వీర్ తన పాత్ర కూడా చేస్తే బాగుంటుందని భజ్జీ భావిస్తున్నాడేమో. గతంలో రణవీర్ సింగ్ '83' చిత్రంలో కపిల్ దేవ్ పాత్రలో ఒదిగిపోయి,



ఆ పాత్రను ఎంత అద్భుతంగా పోషించగలడో నిరూపించుకున్నాడు. ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద పెద్దగా విజయం సాధించకపోయినా, రణవీర్ నటనకు మాత్రం ప్రశంసలు దక్కాయి. మరోవైపు, విక్కీ కౌశల్ 'ఛావా' చిత్రంలో తన పాత్రలో సీరియస్ నెస్ ను చూపించాడు.బాక్సాఫీస్ వద్ద రూ. 600 కోట్లకు పైగా వసూలు చేసాడు. హర్భజన్ సింగ్ బయోపిక్‌లో తన పాత్రను ఎవరు పోషిస్తారో, ఆ చిత్రం ఎలా రూపుదిద్దుకుంటు-ందో చూడాలి. విక్కీ కౌశల్ తన ఇంటెన్సిటీతో కాని రణవీర్ సింగ్ తన ఎనర్జీతో భజ్జీ పాత్రలో మెప్పిస్తారో లేరో చూడాలి.

## దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్‌లో ఎన్టీఆర్?



టాకీస్: తాజా సమాచారం ప్రకారం సినీ పితామహుడిగా పరిశ్రమ కొనియాడే దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్ లో నటించేందుకు తారక్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ప్రచారం నడుస్తుంది. ఈ ప్రాజెక్టు వెనుక రాజమౌళి, కార్తికేయ, వరుణ్ గుప్తా ప్రమేయం కూడా ఉందని టాక్. అంతే కాదు.. ఇప్పటికే స్క్రిప్ట్ కూడా సిద్ధం కాగా, అది విన్న జూనియర్ ఎన్టీఆర్ చాలా ఎగ్జైట్ అయి ఓకే చేశారట. అయితే భారతీయ చలన చిత్ర పరిశ్రమ ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ రెండేళ్ల కిందటనే 'మేడ్ ఇన్ ఇండియా' అనే సినిమా అనౌన్స్ చేయగా, దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి సమర్పణలో నితిన్ కక్కర్ మూవీని తెరకెక్కించబోతున్నట్టు తెలిపారు. దీనికి
సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు, త్వరలో వెల్లడిస్తామని అప్పుడు చెప్పగా, ఆ తర్వాత దాని నోరు విప్పింది లేదు. కాని ఇప్పుడు ఉన్నట్టుండి ఇందులో ఎన్టీఆర్ నటిస్తారని వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. దాదాసాహెబ్ ఫాల్కే జీవితం చాలా పెద్దది. అలాంటి కథలను కచ్చితంగా ఇప్పటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. అందుకే జూనియర్ ఎన్టీఆర్ లాంటి నటు-డు అయితేనే ఈ ప్రాజెక్ట్ భాగా చేయగలరు. మరి ఇండియన్ సినిమా పుట్టుక, పెరుగుదలను తెలియజేస్తూ.. సినిమాలకి బీజం ఎక్కడ పడింది, ఎదిగే క్రమంలో ఎలాంటి ఒడిదుడుకులు ఎదుర్కోవలసి వచ్చింది అనేది చిత్రంలో చూపించనున్నారట.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.